

ఏఈ జాబ్ వదులుకుని సివిల్స్ సాధించాడు

● యూపీఎస్సీ పరీక్షల్లో 988వ ర్యాంకు సాధించిన సురేష్

నారాయణవనం/పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి):ఐఏఎస్ అధికారి కావడం కోసం జెన్‌కోలో ఏఈ ఉద్యోగం వదులుకున్న సురేష్ 7వ సారి అనుకున్నది సాధించారు.ఈ సందర్భంగా మంగళవారం ఆంధ్రజ్యోతి ప్రతినిధితో మాట్లాడారు.

● ఆ ఇద్దరే స్ఫూర్తి

చదివిన చదువుకు ప్రభుత్వ ఉద్యోగం చేసుకుంటే సరిపోతుంది కదా అన్న ఆలోచన అమ్మానాన్నలది.నాకు చిన్నప్పటినుంచీ స్వామి వివేకానంద,మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం అంటే ఎంతో ఇష్టం.వారి స్ఫూర్తితోనే సమాజానికి నావంతు మరింత మెరుగైన సేవలందించాలని భావించా.సివిల్స్ వైపు దృష్టి సారించా.ఇంటర్వ్యూ వరకూ వెళ్లగలిగినా ఫలితం లేకుండాపోయింది.దీంతో ఏఈ ఉద్యోగానికి రిజైన్ చేసి సివిల్స్‌పైనే పూర్తి శ్రద్ధ పెట్టా.

కరోనాతో పోరాటం

2020లో ఢిల్లీ వెళ్లిన నాకు దేవుడు పరీక్ష పెట్టాడు. కరోనాతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నా.అమ్మానాన్నకు తెలిస్తే ఆందోళన పడతారని చెప్పలేదు.2021లో మరోసారి కరోనా సోకడంతో ప్రాణాపాయ పరిస్థితుల నుంచి బయటపడ్డా. యాంటీబయాటిక్స్ ఎక్కువ వాడడం వినికిడి సమస్య తెచ్చిపెట్టింది.నా కలకు నాలుగు సంవత్సరాల కాలయాపనకు కారణమైంది.చివరకు ఏడవ ప్రయత్నంలో ఈసారి నా కలను నిజం చేసుకున్నా.

గ్రామచైతన్య ఫౌండేషన్

మా ఊరికి ఏదో ఒకటి చేయాలన్న ఆలోచన నుంచి గ్రామ చైతన్య ఫౌండేషన్ స్థాపించా. శ్రీశైలంలో ఏఈగా పని చేస్తున్నప్పుడు ఆదివాసి పిల్లలు, మత్స్యకారుల పిల్లలు విద్యకు దూరంగా ఉండడం చూసి బాధపడ్డా.వారికి విద్య పట్ల అవగాహన కల్పించాలన్న సత్సంకల్పంతో ఫౌండేషన్ ఏర్పాటు చేశా. అందుకు నాతో పాటు పని చేసే జెన్‌కో ఉద్యోగులు కూడా సహకరించారు. ఈ క్రమంలో సమాజం పట్ల మెరుగైన అవగాహన ఏర్పడింది. సివిల్స్‌లో నా ఆప్షనల్ సబ్జెక్ట్ తెలుగు సాహిత్యం.పుస్తకాలను నిరంతరం చదువుతుంటా.

నారాయణవనం మండల పరిధిలోని గోవిందప్ప నాయుడు కండ్రిగలో నివాసముంటున్న రైతు మురగయ్య, మునిలక్ష్మి దంపతుల కుమారుడు పాములి సురేష్ మంగళవారం విడుదలైన యూపీఎస్సీ పరీక్షల్లో 988వ ర్యాంకు సాధించారు.మెకానికల్ విభాగంలో నంద్యాలలో డిప్లొమా పూర్తి చేసిన సురేష్..కర్నూలు పుల్లారెడ్డి కళాశాలలో బీటెక్ పూర్తి చేశారు.2012లో ఏపీ జెన్‌కో ఏఈ పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన పరీక్షల్లో ఉమ్మడి ఏపీలో మొదటి ర్యాంకు సాధించారు.ఏఈగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ సమాజానికి ఏదైనా చేయాలనే లక్ష్యంతో 2017 నుంచి సివిల్స్ ఎగ్జామ్స్ రాయడం ప్రారంభించారు. 2018లో ఇంటర్వ్యూ వరకు వెళ్లినా అదృష్టం వరించలేదు. 2019, 2020 సంవత్సరాల్లో సివిల్స్ ఫలితాలు నిరాశకు గురిచేశాయి. దీంతో శ్రీశైలంలో ఏఈ ఉద్యోగానికి రాజీనామా చేసి దేశ రాజధాని ఢిల్లీ బాటపట్టారు. పట్టువదలని విక్రమార్కుడిలా ఈసారి 988 వ ర్యాంకు సాధించారు.



'ఆన్‌లైన్' అతిపెద్ద సోర్స్

● సివిల్స్ కోసం ఢిల్లీకి అవసరం లేదంటున్న శ్రీకాంత్

పలమనేరు/ తిరుపతి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) :సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో నెగ్గాలనుకునేవాళ్లు ఢిల్లీకి వెళ్లి పెద్దపెద్ద శిక్షణ సంస్థల్లో చేరాల్సిన అవసరం లేదని, అందరికీ అందుబాటులోకొచ్చిన ఆన్‌లైన్ సర్వీసులను శ్రద్ధగా ఉపయోగించుకుంటే సరిపోతుందంటున్నారు రంపం శ్రీకాంత్.ఈ ఏడాది సివిల్ సర్వీసెస్ ఫలితాల్లో 904వ ర్యాంకు సాధించిన శ్రీకాంత్ మంగళవారం సాయంత్రం తిరుపతిలో ఆంధ్రజ్యోతి ప్రతినిధితో మాట్లాడారు.

● నాన్న చెప్పిన మాటలతోనే

ఐఏఎస్ కావాలని నాన్న చిన్నతనం నుంచీ చెప్పేవారు. అయితే నేను పెద్దగా ఫోకస్ చేయలేదు. ఇంటర్మీడియట్ వరకు పలమనేరులోనే చదివా. ఆ తర్వాత హైదరాబాదులో ఇంజనీరింగ్, బెంగుళూరులో ఎంబీఏ పూర్తి చేశా. గూగుల్, అమెజాన్ వంటి సంస్థల్లో పనిచేస్తున్నప్పుడు నాన్న చెప్పిన మాటలు మళ్లీ గుర్తుకు వచ్చాయి. పదేపదే ప్రేరణగా వినిపించాయి. సివిల్స్‌కు ఎంపికవ్వాలని నిర్ణయం తీసుకున్నా.ఓవైపు ఉద్యోగం చేసుకుంటూనే మరో వైపు సివిల్స్‌పై దృష్టి పెట్టా. ఎలాంటి శిక్షణ తీసుకోలేదు.నాలుగుసార్లు పట్టువదలకుండా ప్రయత్నిస్తే ఈసారి అవకాశం వచ్చింది.

● ఆన్‌లైన్ వాడుకుంటే చాలు

సివిల్స్ పరీక్షలు రాయాలనుకునేవారు ఆన్‌లైన్‌లో దొరికే కంటెంట్ వాడుకుంటే సరిపోతుంది.దాంతో పాటు ఎవరైనా మెంటార్ దగ్గర మెలకువలు తెలుసుకోండి. నేను ఆ పనిచేయలేకపోవడం వల్ల నాలుగుసార్లు ప్రయత్నించాల్సి వచ్చింది.కరెంట్ ఎఫైర్స్‌పై అవగాహన పెంచుకోవడం, రెగ్యులర్‌గా న్యూస్ పేపర్లను చూడడం అలవాటు చేసుకోవాలి. నావరకు నేను ఇదే పద్ధతి అనుసరించా.


అత్తమామల అభినందనలు అందుకుంటున్న శ్రీకాంత్

ఈ ఏడాది సివిల్ సర్వీసెస్ ఫలితాల్లో 904వ ర్యాంకు సాధించిన శ్రీకాంత్ ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని బైరెడ్డిపల్లె వాసి.ఈయన తండ్రి నాగరాజు ప్రధానోపాధ్యాయుడిగా పని చేసి రిటైరవగా తల్లి రేణుక గృహిణి. ఉద్యోగరీత్యా శ్రీకాంత్ తల్లిదండ్రులు పలమనేరులో స్థిరపడ్డారు.పాఠశాల విద్యాభ్యాసం పలమనేరులో, ఇంజనీరింగ్ గ్రాడ్యుయేషన్ హైదరాబాద్ సీబీఐటీలో, బెంగళూరు ఐఐఎంలో ఎంబీఏ పూర్తి చేసిన శ్రీకాంత్ గూగుల్ కంపెనీలో డిజిటల్ మార్కెటింగ్ మేనేజర్‌గా పని చేస్తూ ఎవరి వద్దా శిక్షణ తీసుకోకనే సమగ్ర ప్రణాళికతో నిర్విరామంగా కృషిచేసి సివిల్ సర్వీసెస్ ఫలితాల్లో ఉన్నతమైన ర్యాంక్ సాధించారు.శ్రీకాంత్ సోదరి మధురిమ గైనకాలజిస్టుగా బెంగళూరులో పని చేస్తున్నారు. తిరుపతి జిల్లా అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ జ్యోత్స్న కుమార్తె శ్రావ్యను శ్రీకాంత్ ఐదేళ్ల క్రితం పెళ్లాడారు.శ్రావ్య ప్రస్తుతం బెంగళూరులోని టార్గెట్ కంపెనీలో ఫైనాన్స్ మేనేజర్‌గా పని చేస్తున్నారు.వీరికి మూడేళ్ల పాప వుంది.

ఏఎస్ఐ నుంచి కానిస్టేబుళ్ల దాకా..!

బదిలీలకు నేటి నుంచి కౌన్సెలింగ్

నాలుగు ఆప్షన్లతో కోరుకున్న చోటుకు

చివరగా ఎస్ఐలకూ స్థానచలనం

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పోలీసుల బదిలీలకు రంగం సిద్ధమైంది. ఏఎస్ఐల నుంచి కానిస్టేబుళ్ల వరకు దాదాపు 475 మంది బదిలీ కానున్నట్లు తెలిసింది. ఐదేళ్లుగా ఒకేచోట పనిచేస్తున్న వారు, విమర్శలు, ఆరోపణలు, సక్రమంగా పని చేయని వారిని బదిలీ చేయనున్నారు. బుధవారం నుంచి ఎస్పీ హర్షవర్ధన రాజు ఈ బదిలీల ప్రక్రియ చేపట్టనున్నారు. తొలుత కానిస్టేబుళ్ల బదిలీలు పూర్తి చేసి, ఆ తర్వాత హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్ఐలు.. చివరగా ఎస్ఐల బదిలీలు పూర్తి చేయనున్నారు. ఇలా దాదాపు 475 మందిని బదిలీ చేసే దిశగా చర్యలు చేపట్టారు. ప్రస్తుతం బదిలీ కానున్న 393 మంది కానిస్టేబుళ్ల ఐడీ నెంబరు, పేర్లు, ప్రస్తుతం పనిచేస్తున్న ప్రాంతం, ఎప్పటి నుంచి అక్కడ పనిచేస్తున్నారు? ఎన్ని సంవత్సరాలు అయింది? తదితర వివరాలు తీసుకున్నారు. వీరందరినీ బుధవారం తిరుపతి ఎస్పీ కార్యాలయానికి పిలిపించి బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా వారి నుంచి నాలుగు ఆప్షన్లను తీసుకొని.. అవకాశం ఉన్నంత వరకు అందులో ఒక ప్రాంతానికి బదిలీ చేయనున్నారు. ఒకవైపు కొందరు తాము కోరుకున్న చోటుకు బదిలీ కావడానికి నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధుల నుంచి సిఫార్సు లేఖలు తీసుకురాగా.. మరోవైపు పలానా వాళ్లను తమ ప్రాంతంతో నియమించాలని ఎస్పీకి రాజకీయ ఒత్తిడి వస్తున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. పనితీరు, క్రమశిక్షణ, పీజీఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారం, అధికారుల ఆదేశాలు అమలు చేయడం వంటివాటిని ఏఎస్ఐల బదిలీలకు కొలమానంగా తీసుకోనున్నట్లు తెలిసింది. చివరగా ఎస్ఐల బదిలీలు ఉంటాయని సమాచారం. పోలీసు శాఖలో బదిలీలను పూర్తి పారదర్శకంగా చేస్తామని, ఎవరి ఒత్తిళ్లకు తలొగ్గేది లేదని ఎస్పీ హర్షవర్ధన రాజు మంగళవారం ఆంధ్ర జ్యోతికి చెప్పారు.


విష్ణునివాసం వద్ద ట్రాఫిక్ సమస్యను డ్రోన్ ద్వారా గుర్తించి క్లియర్ చేస్తున్న పోలీసులు

గంజాయి, ట్రాఫిక్‌పై డ్రోన్ నిఘా

● తిరుపతిలో ముగ్గురి అరెస్టు ● నిబంధనలను అతిక్రమించిన వాహనదారుల గుర్తింపు

తిరుపతి (నేరవిభాగం), ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): సీసీ కెమెరాలు లేవు. పోలీసులూ లేరు. చుట్టుపక్కల జనం లేరు. ఇక, మనల్ని చూసేదెవరని అనుకుంటున్నారా? శివారు ప్రాంతాల్లో గంజాయి తీసుకుంటున్నారా? రోడ్లపై ఇష్టారాజ్యంగా హారన్లు మోగిస్తూ, ట్రాఫిక్ నిబంధనలు విస్మరిస్తున్నారా? అలాంటి వారు ఇక అప్రమత్తం కావాలి. ఎందుకంటే ఆకాశం నుంచి మూడు కిలోమీటర్ల వరకు డ్రోన్ నిఘా ఉంటోంది. ఇలా తిరుపతిలో గంజాయి బ్యాచ్‌కు చెందిన ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని పలుచోట్ల సోమవారం అర్ధరాత్రి అధునాతన మ్యాట్రిక్ 4 థర్మల్ డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టారు. తిరుపతి వెస్ట్ పరిధిలోని వెస్ట్ రైల్వే స్టేషన్, పరిసర ప్రాంతాల్లో స్పాట్ లైట్ కెమెరాలతో 112 జూమ్ కెమెరాలు కలిగి రెండు నుంచి మూడు కిలోమీటర్ల దూరం వరకు గంజాయి, మత్తు పదార్థాలు తీసుకుంటున్నా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా గుర్తించి కనిపెట్టే డ్రోన్‌ను ఎగురవేశారు. చీకటి ఉన్నా.. స్పష్టంగా డ్రోన్ కెమెరాలు ఫొటోలు తీస్తాయి. వీటిని పరిశీలిస్తూ పోలీసులు రంగంలోకి దిగుతారు. ఇలా సోమవారం రాత్రి తిరుపతి వెస్ట్ రైల్వే స్టేషన్ పరిధిలో డ్రోన్ ఎగురవేసినప్పుడు.. అక్కడ మనుషులు తిరగని ప్రాంతంలో ముగ్గురు గంజాయి తీసుకుంటున్నారు. వీరిని డ్రోన్‌లోని కెమెరా గుర్తించగానే.. పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకుని ఆ ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వీరిపై కేసులు నమోదు చేశారు.

దాక్కున్నా దొరుకుతారు

అర్ధరాత్రి పూట అడవులు, దట్టమైన ప్రాంతాలు, శివారు ప్రాంతాల్లో కూర్చుని మద్యం తాగుతున్నా, పేకాట వంటివి ఆడుతున్నా వెంటనే స్పాట్‌లైట్ కెమెరాలు వున్న డ్రోన్లు కనిపెట్టేస్తాయి. ఫొటోలు తీస్తాయి. ఇక, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించినా, ఎవరైనా చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని ప్రవర్తించినా డ్రోన్ కెమెరాలు పట్టేస్తాయి. ఎక్కడ దాక్కున్నా డ్రోన్ల నిఘాకు దొరుకుతారు. అలాంటి అలాంటి వారి ఆట కట్టిస్తాం. ప్రతి సబ్ డివిజన్ పరిధిలో ఒక డ్రోన్‌తో నిరంతర నిఘా ఉంటుంది.

- హర్షవర్ధనరాజు, ఎస్పీ

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించినా..

తిరుపతిలో ట్రాఫిక్ రద్దీగా ఉన్న రైల్వే స్టేషన్, బస్టాండు, విష్ణునివాసం తదితర ప్రాంతాల్లో మంగళవారం అధునాతన డ్రోన్ కెమెరాల ద్వారా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై పోలీసులు కొరడా ఝుళిపించారు. విష్ణు నివాసం వద్ద ట్రాఫిక్ సమస్యను డ్రోన్ ద్వారా గుర్తించగానే అక్కడి ట్రాఫిక్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వెంటనే రంగంలోకి దిగి క్రమబద్ధీకరించారు. ట్రాఫిక్ పోలీసుల కొరత నేపథ్యంలో పలు కూడళ్లలో సిబ్బంది లేకపోవడంతో వాహనదారులు నిబంధనలు అతిక్రమించడం, అడ్డదిడ్డంగా రోడ్లపై పార్కింగ్ చేయడం, నిషేధిత హారన్లతో శబ్దం చేస్తూ ప్రజలకు ఇబ్బంది కలిగించేవారు. అలాంటి వారికి డ్రోన్‌తో చెక్ పెడుతున్నామని, ఎవరైనా ఇష్టారాజ్యంగా హారన్లు వేసుకుని వెళితే కేసులు బనాయిస్తామని ట్రాఫిక్ సీఐ సంజీవ్‌కుమార్ హెచ్చరించారు. ప్రతిరోజూ తిరుపతిలో ఎక్కడో ఒక చోట డ్రోన్‌తో నిఘా ఉండనే ఉంటుంది.

తిరుపతిలో స్వామి హాంఫట్

పూజలు, మంత్రాలు, తిరుమలలో దుకాణాలు ఇప్పిస్తానని మోసం

రూ.10 కోట్లతో పలాయనం

లబోదిబోమంటున్న బాధితులు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): పూజలు, మంత్రాల పేరు చెప్పాడు. తిరుమలలో దుకాణాలు ఇప్పిస్తానన్నాడు. ఇలా పలువురిని మోసం చేసిన ఓ స్వామి.. రూ.10 కోట్లతో పలాయనం సాగించిన ఉదంతం ఆలస్యంగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. బాధితులు తెలిపిన ప్రకారం.. చెన్నైకి చెందిన స్వామి కొన్నేళ్ళ కిందట కుటుంబంతో పాటు తిరుపతికి వలసొచ్చాడు. 2021లో తిరుమలకు మకాం మార్చాడు. అక్కడ ఒక ఇల్లు అద్దెకు తీసుకుని పూజలు, మంత్రాలు పేరుతో భారీ ఎత్తున డబ్బులు వసూలు చేశాడు. ఈ క్రమంలో అక్కడి ఇంటి యజమానితో గొడవ పడి తిరుపతికి వచ్చాడు. శివజ్యోతినగర్‌లో కాపురం పెట్టాడు. ఇతడికి ఇద్దరు పిల్లలు. గత రెండున్నర సంవత్సరాలుగా తిరుపతిలో ఉన్నాడు. తెలిసిన వారికి జాతకాలు చెప్పడం, మంత్రాలు, తంత్రాలు చేయడం, వివిధ రకాల పూజలు చేస్తూ ప్రజలను నమ్మించాడు. తనకు జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులు బాగా తెలుసని, ఏవైనా పనులు కావాలంటే చేసి పెడతానని పలువురికి చెప్పాడు. తిరుమలలో దుకాణాలు తీసిస్తానన్నాడు. ఇతడిని నమ్మిన కొందరు తమ పనుల నిమిత్తం రూ.15 లక్షల నుంచి రూ.90లక్షల వరకు స్వామికి ఇచ్చారు. తిరుమలలో దుకాణం ఇప్పిస్తానని చెప్పి, అక్కడి బాలాజీనగర్‌లోని ఇద్దరు అన్నదమ్ముల వద్ద దాదాపు రూ.1.30 కోట్లు తీసుకున్నట్లు వీరిలో ఒకరు చెప్పారు. ఇలా దాదాపు 10నుంచి 15 మంది బాధితులు ఉన్నారు.వారం రోజులుగా అతడు కనిపించకపోవడంతో అనుమానం వచ్చిన బాధితులు శివజ్యోతినగర్‌లోని ఇంటికి వెళ్లి చూడగా తాళాలు వేసి ఉంది.చుట్టుపక్కల వారిని విచారించగా ఈ నెల 16న ఊరికి వెళుతున్నానని చెప్పి వెళ్ళారని చెప్పారు. దీంతో వారం రోజులుగా వేచి చూసిన బాధితులు చివరకు అలిపిరి పోలీసులను మంగళవారం ఆశ్రయించారు.

ట్రాక్టర్, బస్సు ఢీ

● 45 మందికి గాయాలు

రేణిగుంట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలం మర్రిగుంట మలుపు వద్ద మంగళవారం ఉదయం 7.30 గంటలకు జరిగిన ప్రమాదంలో 45 మంది గాయపడ్డారు. యోగానంద ఉమెన్స్ హాస్టల్ నుంచి విమానాశ్రయం సమీపంలోని ఫోక్స్ లింక్ పరిశ్రమలో పనిచేయడానికి మహిళా ఉద్యోగులు కంపెనీ బస్సులో బయలు దేరారు. అదే సమయంలో రేణిగుంట నుంచి పాపానాయుడుపేటకు వెళ్తున్న ట్రాక్టర్ మర్రిగుంట మలుపు వద్దకు వచ్చిది. వేగాన్ని నియంత్రించే క్రమంలో బ్రేకులు వేసినా.. బస్సు, ట్రాక్టర్ ఢీకొన్నాయి. ఈ ఘటనలో బస్సు బోల్తా పడింది. అందులో ఉన్న 45 మంది మహిళ ఉద్యోగులు గాయపడ్డారు. డీఎస్పీ శ్రీనివాసరావు సిబ్బందితో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. స్వల్పంగా గాయపడిన 35 మందికి ప్రథమ చికిత్సలందించారు. ఆరుగురు తీవ్రంగా గాయపడగా ఇందులో నలుగురు ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. గాజులమండ్యం ఎస్ఐ సుధాకర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


గాయపడిన మహిళా ఉద్యోగులు

మర్రిగుంట మలుపు వద్ద బోల్తా పడిన ట్రాక్టర్, బస్సు



తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళ ఉద్యోగి

శ్రీసిటీలో అమార్ఫస్ మెటల్ తయారీ ప్లాంట్

● రూ. 1055 కోట్ల పెట్టుబడి.. 515 మందికి ఉపాధి

తిరుపతి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలో అమార్ఫస్ మెటల్ మానుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీ ఏర్పాటుకుగాను మెస్సర్స్ ప్రొటీరియల్ లిమిటెడ్ సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ ప్యాకేజీ కింద పలు రాయితీలు, మినహాయింపులు ప్రకటించింది. ఏడాదికి 64,800 టన్నుల అమార్ఫస్ సామర్థ్యం, రూ.1055 కోట్ల పెట్టుబడితో 515 మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తామని ఆ సంస్థ ప్రభుత్వానికి నివేదించింది. తొలి దశలో వచ్చే ఏడాది మార్చికల్లా ప్లాంట్ నిర్మాణం పూర్తి చేసి, పవర్ కనెక్షన్ తీసుకుంటామని, ఏప్రిల్‌లో ఉద్యోగులకు శిక్షణ పూర్తి చేస్తామని తెలిపింది. జూన్‌లో యంత్రాల ఏర్పాటు చేసి అక్టోబరుకల్లా ప్లాంట్‌ను ప్రారంభానికి సిద్ధం చేస్తామని నవంబరు నుంచీ ఫస్ట్ లైన్ ప్రొడక్షన్, 2027 ఏప్రిల్ నుంచీ సెకండ్ లైన్ ప్రొడక్షన్ ప్రారంభిస్తామని తెలిపింది. రెండవ దశ పనులు 2030 మార్చి నాటికి పూర్తి చేస్తామని నివేదించింది. ఈ నెల 4న ఎస్ఐపీసీ, 10న ఎస్ఐపీబీ సమావేశాల్లో చేసిన సిఫారసులు సమీక్షించిన ప్రభుత్వం స్పెషల్ ప్యాకేజీ కింద పలు రాయితీలు, మినహాయింపులు మంజూరు చేస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.

జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



పూజిత -పునీత్‌కుమార్

చంద్రగిరి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఎ.రంగంపేట ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు మహారాష్ట్రలో ఈనెల 24 నుంచి జరిగే జాతీయ స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల హిందూపూర్‌లో జరిగిన స్టేట్ మీట్‌లో 9వ తరగతి విద్యార్థులు పునీత్‌కుమార్, పూజితలు ఫుట్‌బాల్ క్రీడలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. వీరి తండ్రి జగన్మోహన్ ఫోటోగ్రాఫర్‌గా, తల్లి మాదవి దినసరి కూలీగా పనిచేస్తున్నారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు డాక్టర్ ప్రభాకర్‌రావు దగ్గర ఈ విద్యార్థులు తర్ఫీదు పొందారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన పునీత్‌కుమార్,పూజితలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మదన్‌మోహన్, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్లాస్టిక్ వినియోగంతో భూమికి చేటు



భూమి దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు

చంద్రగిరి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఎ.రంగంపేటలోని మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో మంగళవారం భూమి దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఐఎఫ్ఎస్ అధికారులు వివేక్, నరేందేరన్‌లు హాజరయ్యారు. ఈసందర్భంగా వివేక్ మాట్లాడుతూ భూమిపై ప్లాస్టిక్ ప్రభావం కలిగించే నష్టాలను వివరించారు. భూ సంరక్షణ కోసం సంప్రదాయ పద్ధతులను పాటించాలని సూచించారు. నరేందేరన్ మాట్లాడుతూ విద్యుత్ వినియోగాన్ని తగ్గించాలని, సమర్థవంతంగా వినియోగించే విధంగా దృష్టి సారించాలన్నారు. ప్రస్తుత కాలంలో జీవ ఇంధన వనరులను ప్రకృతి సిద్ధంగా మార్చి ఉపయోగించే మార్గాలపై వివరించారు. అనంతరం వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఎంబీయూ వీసీ కరుణాకరన్, రిజిస్ట్రార్ సారథి, వ్యవసాయ కళాశాల డీన్ గిరిధర్‌కృష్ణ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నాయకుల సంబరాలు



చంద్రగిరి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఎంఆర్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి ఎంఆర్పీఎస్ నాయకులు మంగళవారం పాలాభిషేకం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు ఆర్డినెన్స్ జారీ చేసిన క్రమంలో ఎంఆర్పీఎస్ నాయకులు, కార్యకర్తలు చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద సంబరాలు జరుపుకొన్నారు. బాణసంచా కాల్చి కేక్ కట్ చేశారు. మంద కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు విశ్వనాథమాదిగ, ఎంఆర్పీఎస్ జిల్లా అధ్యక్షుడు వేలూరు రాజేంద్ర, నాయకులు పులిగుంట్ల గోపి, గంగయ్య, ధనంజయులు, మునిరత్నం, రవి, ఓబులేసు, కృష్ణమూర్తి, శంకరయ్య పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం



సుధారెడ్డిని సత్కరిస్తున్న మహిళలు

చంద్రగిరి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి సుధారెడ్డి అన్నారు. మంగళవారం తొండవాడలో మహిళలతో ముఖాముఖి నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మహిళల కోసం ప్రభుత్వం స్వయం ఉపాధి కల్పనకు అనేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. తద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ప్రభుత్వం మహిళల భద్రత కోసం శక్తియాప్, 1002 అత్యవసర నెంబర్ ప్రవేశపెట్టిందన్నారు. టీడీపీ నాయకులు పులికంటి మోహన్‌రెడ్డి, ఉమాపతిరెడ్డి, జగన్మోహన్‌నాయుడు, మణియాదవ్, శంకర్‌యాదవ్ పాల్గొన్నారు.

ఉద్యోగులు సమయపాలన పాటించాలి



మొక్కలు నాటుతున్న రవికుమార్ నాయుడు

భాకరాపేట, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు సమయపాలన పాటించాలని జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు కోరారు. చిన్నగొట్టిగల్లు మండల పరిషత్ కార్యాలయాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రభుత్వం ద్వారా మంజూరైన అభివృద్ధి, సంక్షేమ పథకాల నిధులు, వాటి ప్రగతిని తెలుసుకున్నారు. పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛ ఆంధ్రపై సమీక్షించారు. అనంతరం కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో గిడ్డయ్య, డిప్యూటీ ఎంపీడీవో సోమశేఖర రెడ్డి, ఏవో సతీశ్ కుమార్, విజయ్ కుమార్, నాగేశ్వరరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు.

నవధాన్యాలతో భూసారం పెంపు

భాకరాపేట, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): నవధాన్యాల విత్తనాలు విత్తితే భూమి సారవంతంగా మారుతుందని మండల వ్యవసాయ అధికారి ధనలక్ష్మి తెలిపారు. చట్టేవారిపాళెంలో ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలకు 30 రకాల పీఎండీఎస్ కిట్లపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సేంద్రీయ ఎరువులు, కషాయాలు, ద్రావణాలు ఉపయోగించి చీడపీడలు నివారించవచ్చునన్నారు. విత్తనాలు విత్తడం వల్ల వర్షానికి మొలకెత్తిన తరువాత భూమిలో కలియ దున్నడం ద్వారా భూమి సారవంతంగా మారుతుందన్నారు. పీఎండీఎస్ కిట్లను ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ సరస్వతి, యూనిట్ ఇన్‌ఛార్జ్ రంగనాయకులు, గౌతమి, ఐసీఆర్‌పీలు లలిత, భువనేశ్వరి, జయసుధ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చిన్నారుల గ్రాడ్యుయేషన్ డే



పాకాల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఇన్‌ఫెంట్ జీసస్ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో మంగళవారం గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. యూకేజీ, 5వ తరగతి పూర్తిచేసిన చిన్నారులు కాన్వొకేషన్ దుస్తులు ధరించి పండుగ వాతావరణంలో సర్టిఫికెట్లు అందుకున్నారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కరెస్పాండెంట్ రెవరెండ్ డాక్టర్ వై.ఆంతోనిరాజ్, హెడ్‌మాస్టర్లు కె.రెడ్డిలత, ఎజె.షకీలా, ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథక పనుల పరిశీలన

రామచంద్రాపురం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): నీటికుంటలు, పశువుల తొట్టిల నిర్మాణాలు నాణ్యతగా చేపట్టాలని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ ఆదేశించారు. రాయలచెరువుపేట, రామాపురం గ్రామాల్లో చేస్తున్న ఉపాధి పనులను పీడీ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల వద్ద కూలీలకు వసతులు ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం రికార్డులు పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. తనిఖీల్లో ఏపీవో, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యావిలువల బోధనతో ఉత్తమ సమాజ సాధన

ఎర్రావారిపాలెం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి); విద్యతోనే వ్యక్తి వికాసం ఆధారపడి ఉంటుందని ఎంఈవో బాల సుబ్రమణ్యం అన్నారు. చింతగుంట పంచాయతీ మాల పల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యను అందిస్తే ఉత్తమసమాజం తయారవుతుందన్నారు. పాఠశాల ఉపాధ్యాయుడు నాగరాజు అంకిత భావంతో పిల్లలను తీర్చి దిద్దుతున్నారని ప్రశంసించారు. ఈ యేడాది జిల్లా స్థాయిలో జరిగిన సైన్స్ డే లో పాఠశాల విద్యార్థి యశ్వంత్ ప్రథమ స్థానం బహుమతి పొందడం పాఠశాలకు గర్వకారణమన్నారు. సమావేశంలో సీఆర్‌సీ ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్,ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లి దండ్రులు పాల్గొన్నారు.

నారాయణపురంలో భూవివాదం

తిరుపతి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ నారాయణపురంలో మంగళవారం ఇరు వర్గాల మధ్య భూ వివాదం చోటు చేసుకుంది. ఈ వివాదంలో దాదాపు వంద మంది అక్కడకు చేరుకున్నారు. పీలేరుకు చెందిన రేఖ, శ్రీమన్నారాయణరెడ్డి భార్య స్వర్ణ మధ్య వివాదం చెలరేగుతోంది. ఆ భూమి తమదని స్వర్ణ కుటుంబ సభ్యులు.. కాదు కాదు అని రేఖ కుటుంబ సభ్యులు గొడవలకు దిగారు. దీంతో రంగ ప్రవేశం చేసిన పోలీసులు ఇరు వర్గాలను చెదర గొట్టారు. దీంతో వివాదం సద్దుమణిగింది.

చంద్రగిరి

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు

భాకరాపేట, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో గిడ్డయ్య తెలిపారు. సబ్సిడీ వర్తించే ఈ రుణాలకు మే10 వరకు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. గత ఐదు సంవత్సరాల నుంచి రుణాలు తీసుకోకుండా ఉన్నవారు మాత్రమే అర్హులన్నారు. 21 ఏళ్ల నుంచి 51 ఏళ్లలోపు ఉన్నవారు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకుని మూడు సెట్ల దరఖాస్తులు మండల పరిషత్ కార్యాలయంలో అందజేయాలన్నారు.

అగ్నిప్రమాదాలపై ఆలయ సిబ్బందికి అవగాహన



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

తిరుచానూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారి ఆలయం వద్ద అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో పోటు వర్కర్లకు, టీటీడీ సిబ్బందికి అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. అమ్మవారి ఆలయ పోటులో లడ్డూపోటులో అగ్నిప్రమాదాలు సంభవిస్తే ఎలా ఎదుర్కోవాలో వివరించారు. వెలుపల అగ్నిప్రమాదాలు జరిగితే ఎలా ఎదుర్కోవాలో విజిలెన్సు ఆలయ ఉద్యోగులకు ఏడీఎఫ్‌వో కిరణ్‌కుమార్, ఆలయ ఏవీఎస్వో సతీష్ అవగాహన కల్పించారు.

రేపు మండల మీట్

ఎర్రావారిపాలెం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండల సర్వ సభ్య సమావేశం గురువారం ఉదయం జరుగుతుందని ఎంపీడీవో అరుణ తెలిపారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో జరిగే మండల మీట్‌కు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు సమాచారంతో హాజరు కావాలని కోరారు.

తిరుమలలో యువకుడి ఆత్మహత్య



గణేష్ మృతదేహం

తిరుమల, ఏప్రిల్22 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో మంగళవారం సుమారు పదహారేళ్ల వయస్సు కలిగిన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల మేరకు.. శ్రీవారి దర్శనం కోసం భక్తులు వేచిఉండే వైకుంఠం క్యూకాంప్లెక్స్ సమీపంలోని ఏటీసీ వద్దనున్న మరుగుదొడ్డిలో ఓ యువకుడు ఉరివేసుకుని ఉండటాన్ని పారిశుద్ధ్య కార్మికులు గుర్తించారు. వెంటనే పోలీసులు, విజిలెన్స్ అధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే మృతదేహాన్ని అంబులెన్స్ ద్వారా తిరుపతి రుయాకు తరలించారు. కాగా, పోలీసులు జరిపిన విచారణలో మృతుడు రాయచోటికి చెందిన గణేష్‌గా తేలింది. తన అన్న తిరుమలలోని ఓ టీ స్టాల్‌లో పనిచేస్తున్నాడని, అడిగిన డబ్బులు ఇవ్వకపోవడంతోనే మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడినట్టు సమాచారం. మృతదేహాన్ని ఆగమేఘాలపై తిరుమలలోని అశ్విని ఆస్పత్రికి కాకుండా తిరుపతికి తరలించడంపై తొలత పలు అనుమానాలు వ్యక్తమయ్యాయి.

ట్రాక్టర్‌ను ఢీకొన్న కారు ముగ్గురికి గాయాలు



బోల్తా పడిన ట్రాక్టర్

దొరవారిసత్రం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం టపాయిండ్లు వద్ద జాతీయ రహదారిపై మంగళవారం కారు ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న విజయవాడకు చెందిన కృష్ణచంద్ తీవ్రంగా గాయపడ్డారు. ఆయన భార్య పల్లవికి స్వల్ప గాయాలయ్యాయి. ట్రాక్టర్ డ్రైవర్ గురవయ్య కూడా తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేశారు. మెరుగైన వైద్యం కోసం కృష్ణచంద్‌ను చెన్నైకు తీసుకెళ్లగా ట్రాక్టర్ డ్రైవర్ గురవయ్యను నెల్లూరుకు తరలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ అజయ్‌కుమార్ రోడ్డుపై ఉన్న వాహనాలను పక్కకు తొలగించి వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు.

దోస..రైతులకు నిరాశ

● ధరల పతనంతో దిగాలు



తాటిమాకులపల్లె వద్ద పొలంలోనే పంటను వదిలేసిన రైతులు

ఎర్రావారిపాలెం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): దోస సాగు ఈ యేడాది రైతులకు గుండెకోత మిగిల్చింది. చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాలెం మండలాల్లో ఎక్కువ మంది రైతులు దోస, కర్బూజలను సాగు చేశారు. ఉగాది,రంజాన్ పండుగలకు కోత దశకు వచ్చేలా సాగు చేపట్టారు. రంజాన్ నెల ఉపవాస దీక్షల్లో దోస పండ్లు తింటారనే ఉద్దేశంతో ఈసారి కూడా అత్యధిక విస్తీర్ణంలో సాగుచేశారు. అయితే దిగుబడి బాగున్నా గిట్టుబాటు ధర రాకపోవడంతో రైతులు నిరాశ చెందారు. సాగు కాలం తక్కువే అయినా పంటను చాలా జాగ్రత్తగా చూసుకోవల్సి ఉంటుందని రైతులు చెప్పారు. ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఎరువులు, మందులు వేయాల్సి ఉంటుందన్నారు. కొందరు కౌలు రైతులు కూడా ఈసారి దోస సాగు చేశారు. తీరా పంట చేతి కొచ్చేసరికి కిలో దోస ధర రూ.5 నుంచి రూ.7 వరకు పలికింది. సాధారణంగా ఈసీజనులో రూ.25 నుంచి రూ.30 వరకు పలుకుతుంది. ఎకరా సాగుకు రూ.1.5లక్షల నుంచి రూ.2 లక్షలు పెట్టుబడి అవుతుందని రైతులు చెప్పారు. ధర నిరాశాజనకంగా ఉండటంతో చాలామంది రైతులు తమ పంటను పొలాల్లోనే వదిలేశారు. అడపాదడపా కురిసిన అకాల వర్షాలకు పంట కొంతమేర కుళ్లిపోయింది. పంట నష్టపోయిన తమను ఆదుకోవాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

అభివృద్ధి చూసి ఓర్వలేక చెవిరెడ్డి అసత్య ఆరోపణలు: టీడీపీ



మాట్లాడుతున్న టీడీపీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి, పార్టీ నాయకులు

రామచంద్రాపురం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే పులివర్తి నానిపై అసత్య ఆరోపణలు మానుకోవాలని చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి టీడీపీ నాయకులు హితవు పలికారు. ఆర్‌సీపురం టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఆ పార్టీ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. పార్టీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి మాట్లాడుతూ నాని ఈ తొమ్మిది నెలల్లోనే చేపట్టిన అభివృద్ధి పనులు చూసి చెవిరెడ్డికి మతి భ్రమించిందన్నారు. ఓర్వలేక పసలేని ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఐదేళ్లలో ఒక అభివృద్ధి పనైనా చేసినట్లు నిరూపించగలరా అని ప్రశ్నించారు. జిల్లా యువత ఉపాధ్యక్షుడు ధనంజయ రెడ్డి మాట్లాడుతూ రామాపురంలో రైతుల పొట్టకొట్టి 18 ఎకరాల భూమిని ఆక్రమించి అమ్ముకున్నారని విమర్శించారు. నానిపై అసత్య ఆరోపణలు చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. టీడీపీ నాయకులు నరసింహారెడ్డి, హరిప్రసాద్, మునిరామిరెడ్డి, గిరిధర్‌రెడ్డి, వెంకటేష్‌రెడ్డి, ముద్దు కృష్ణారెడ్డి, ధనంజయులు, మోహన్‌రెడ్డి, బాలప్రసాద్ పాల్గొన్నారు.

కమనీయం... కమలనాథుడి కల్యాణం



వడమాలపేట,22 ఏప్రిల్(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పలాయగుంట లో కొలువై ఉన్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉభయ దేవేరులతో కమల నాథుడి కల్యాణం కమనీయంగా నిర్వహిం చారు. మంగళవారం పద్మావతి, ఆండాళ్ సమేత ప్రసన్న వేంకటేశ్వరుడిని పట్టు పీతాంబరాలతో వధూవరులుగా కల్యాణ పీటాన్ని అధిరోహింప జేశారు. ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు ఆధ్వర్యంలో వేదా మంత్రలు, భక్తుల గోవిందనామ స్మరణల నడుమ ఉభయ నాంచారులకు మాంగళ్య ధారణ చేయించారు. తలంబ్రాలు పోయించారు. పరిసరాల నుంచి భక్తులు విశేషంగా తరలి వచ్చి కల్యాణోత్సవాన్ని తిలకించి తన్మయత్వం చెందారు.

అధికారులు ప్రొటోకాల్ పాటించాలి

నారాయణవనం, ఏప్రిల్ 22(ఆంధ్ర జ్యోతి): మండలంలో రాష్ట్రప్రభుత్వం సారథ్యంలో అనేక సంక్షేమ కార్యక్ర మాలు అమలవుతున్నాయని, అయితే కొంతమంది అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని జడ్పీటీసీ సభ్యుడు కోనేటి సుమన్‌కుమార్ అసహనం వ్య క్తం చేశారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ దివాకర్‌రెడ్డి అధ్య క్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ముందుగా రైలు ప్రమాదంలో మృతి చెందిన భీమునిచెరువు సర్పంచ మురుగేశ్ మృతికి సంతాపం తెలు పుతూ రెండు నిమిషాలు మౌనం పాటిం చారు. అనంతరం సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సుమన్‌కుమార్ మాట్లాడు తూ... అధికారులు అభివృద్ధి పనులపై ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇవ్వడం లేదన్నారు. మండలస్థాయిలో చేసిన తీర్మానాలు, నిర్ణయా లు ఎప్పటికప్పుడు ఎమ్మెల్యేకు తెలియ జేయాలన్నారు. ఎమ్మెల్యేకు తెలియకుండా, ఇతరుల ప్రలోభాలకు, ఒత్తిడిలకు లొంగవద్దని, సమాచారం ఇవ్వకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించే అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. అలాగే సర్పంచులు తమ గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శేఖర్, తహసీల్దార్ జయరాములు, ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు, సర్పంచ్‌లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, అన్ని ప్రభుత్వ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

త్రిపుర గవర్నర్‌కి ఘనస్వాగతం

బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెస్ట్‌వరత్తూరులో ఉన్న వియ్యంకుడి ఇంటికి విచ్చేసిన త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డికి ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, బీజేపీ, జనసేన నాయకులు ఘనస్వాగతం పలికారు. శ్రీకాళహస్తి డీఎస్పీ నరసంహమూర్తి, సీఐ తిమ్మయ్య, ఎస్ఐ విశ్వనాథనాయుడు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

మట్కా కేసులో 8 మంది అరెస్టు

వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బొమిడి కాలవ వద్ద మట్కా(సింగిల్ డిజిట్) ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ సుబ్బారావు మంగళవారం తెలిపారు. పట్టణానికి చెందిన బీదా దర్మయ్య, శివశంకర్, కాలేషా, మహ్మద్ అలీ, రాజేంద్ర, వీర రాఘవులు, హేమంత్, వెంకటేష్‌ను అరెస్టు చేసి, వారి వద్ద రూ.54,400 స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను బుధవారం కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు.

వెలుగు రుణాల గోల్‌మాల్‌పై విచారణ

వరదయ్యపాళెం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి):మండలంలోని వెలుగు సంఘంలో 2022లో జరిగిన రుణాల గోల్‌మాల్‌పై చిత్తూరు డివిజనల్ రెవెన్యూ అధికారి మంగళవారం విచా రణ చేపట్టారు. మండలంలోని డీసీ సీబీలో 17 సంఘాల సభ్యుల పేర్ల మీద సుమారు రూ.1.50కోట్లు ఖాతా ల్లో జమ కాలేదు. ఒకరు ఒక గ్రూపులో ఉండి మరో బ్యాంకులో రుణం ఉన్నా అప్పటి ఏపీఎం తనే స్వయంగా బ్యాంకుకు సమర్పిం చిన రుణ పత్రాల్లో సంఘమిత్రలు, సీసీల సం తకాలు లేకున్నా రుణాలు మంజూరు చేసి నట్లు తెలిసింది. మంజూరైన రుణాలను అన్నింటినీ ఆమెతో పాటు మరికొంతమంది తీసుకున్నారు. ఈ గోల్‌మాల్‌పై గతంలో విచారణ జరిగి 11 మంది అక్రమాలకు పాల్పడినట్టు తేల్చారు. ఏ1గా ఏపీఎం, ఏ2గా దేవి (సంఘమిత్ర)పై ఇప్పటి వరకు ఎలాంటి చర్యా తీసుకోలేదు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు పీఎం మోదీ డబ్బులు పడుతాయని తమల్ని నమ్మించి ఆధార్‌కార్డులు, చిరునామా మార్చి కొత్త సంఘాల పేరుతో రుణాలు తీసుకున్నట్టు బ్యాంకు అధికారులు చెప్పే వరకు తమకు తెలియదని విచారణాధికారి, చిత్తూరు డీఆర్వో మోహన్‌కుమార్, డీసీవో బ్రహ్మానంద రెడ్డికి చెప్పారు.

పోషకాహార లోపం లేకుండా చూడాలి:కలెక్టర్



చిన్నారికి పౌష్టికాహారాన్ని తినిపిస్తున్న కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): బాలింతలకు, గర్భిణిలకు, పిల్లలకు పోషకాహార లోపం లేకుండా కృషిచేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషణ్ పక్వాడాపై జిల్లాస్థాయి సమావేశానికి కలెక్టర్ వెంకటేశ్వర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 8 నుంచి 22వ తేదీ వరకు పోషణ్ పక్వాడాను నిర్వహించినట్లు తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహార కిట్లను సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం కలెక్టర్ వెంకటేశ్వర్ గర్భిణులకు సీమంతం చేశారు. చిన్నారులకు అన్నప్రాసన చేశారు. అంతకుముందు శిశు సంక్షేమ శాఖ ఏర్పాటు చేసిన చిరుధాన్యాల స్టాల్‌ను పరిశీలించి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ అధికారి వసంతబాయి, డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్, డీఏవో శాంతకుమారి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి విజయకుమార్, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

భూసేకరణ త్వరగా పూర్తిచేయాలి

జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టు పనులకు సంబంధించి భూసేకరణ, పెండింగ్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టు పనులకు సంబంధించి పెండింగ్ అంశాలు, నిర్మాణ పురోగతిపై గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా, నేషనల్ హైవే పీడీలు, సంబంధిత అధికారులతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రేణిగుంట, పూడి, గూడూరు, పాకాల, తిరుపతి రైల్వే ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలన్నారు. శ్రీకాళహస్తి-నడికుడి రైల్వే ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ పనులు పూర్తయ్యాయని తెలిపారు. తిరుపతి -రేణిగుంట బైపాస్‌కు సంబంధించిన పెండింగ్ భూసమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని సంబంధిత ఆర్డీవోలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు కిరణ్మయి, భానుప్రకాష్‌రెడ్డి, నేషనల్ హైవే పీడీలు వెంకటేష్, ఎంకే చౌదరి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వేడెక్కిన కుప్పం

● మున్సిపల్ చైర్మన్ కుర్చీకోసం తీవ్ర పోటీ
● 28న చైర్‌పర్సన్ ఎన్నికకు నోటిఫికేషన్



కుప్పం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో రాజకీయం వేడెక్కింది. ఈనెల 28న కుప్పం మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నికకు ప్రభుత్వం మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో పోటీదారుల్లో తీవ్రమైన ఉత్కంఠ నెలకొంది. ఈ క్రమంలో కలెక్టర్‌ను కలవడానికి మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు మంగళవారం చిత్తూరు వెళ్లారు. మరోవైపు విజయవాడలో ఉన్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ బయలుదేరి తిరుపతిదాకా వచ్చారు. ఇంకోవైపు వైసీపీ ఎమ్మెల్సీ, చంద్రబాబుపై పోటీచేసి ఓడిన వైసీపీ నాయకుడు భరత్ కుప్పం చేరారు. అటూఇటూ కూడా రాజకీయాలు వేడెక్కాయనడానికి ఇది నిదర్శనం. కుప్పం మున్సిపాలిటీలో 25 వార్డులుండగా గత ఎన్నికల్లో వైసీపీ అధికారంలో ఉండడంవల్ల 18 వార్డులను గెలుచుకుంది. 16వ వార్డు అభ్యర్థి అయిన డాక్టర్ సుధీర్‌ను చైర్మన్ చేసింది. టీడీపీ కేవలం 6 వార్డులతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అయితే గతేడాది నవంబరు 6వ తేదీన జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో చైర్మన్ పదవితోపాటు, కౌన్సిలర్ పదవికి కూడా సుధీర్ రాజీనామా చేశారు. అంతకు కొన్ని రోజుల ముందే టీడీపీలో చేరడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో చైర్మన్ కుర్చీతోపాటు 16వ వార్డు కౌన్సిలర్ పదవి కూడా ఖాళీ ఏర్పడింది. ఆయనకన్నా ముందే ఐదుగురు వైసీపీ కౌన్సిలర్లు టీడీపీ తీర్థం పుచ్చుకుని, అందులో ఒకరు తిరిగి పాత గూటికి చేరిపోయారు. అంటే ప్రస్తుతం కుప్పం మున్సిపల్ కౌన్సిల్‌లో 10 మంది టీడీపీ, 14 మంది వైసీపీ కౌన్సిలర్లు ఉన్నారు.

● ఎవరి ప్రయత్నాల్లో వారు

టీడీపీ కౌన్సిలర్లలో మున్సిపల్ చైర్మన్ కుర్చీ కోసం తీవ్రమైన పోటీ నెలకొంది. ఖాళీగా ఉన్న 16వ వార్డుకు కూడా ఎన్నికలు నిర్వహించి ఉంటే అక్కడ గెలిచిన అభ్యర్థినే చైర్మన్ పదవి వరిస్తుందన్న భావన ఇటీవలిదాకా కొనసాగింది. అయితే ఆ వార్డుకు ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వకపోవడంతో ప్రస్తుతం ఉన్న 10 మంది టీడీపీ కౌన్సిలర్లలోనే పోటీ పెరిగింది. మున్సిపల్ ఫ్లోర్ లీడర్‌గా కొనసాగుతున్న వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన 19వ వార్డు కౌన్సిలర్ జిమ్ దాము, బలిజ సామాజిక వర్గానికి చెందిన ఎస్.సోమశేఖర్, వన్నెకుల క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన సెల్వరాజ్ ముందు వరుసలో ఉన్నారు. వీరిలో జిమ్ దాము, సెల్వరాజ్ ఇటీవల కులసంఘాల సమావేశాలు ఏర్పాటు చేసి బలనిరూపణకు ప్రయత్నించారు. సోమశేఖర్ అటువంటి ప్రయత్నాలేమీ చేయలేదు కానీ, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్. మునిరత్నాన్నే నమ్ముకున్నారు. పీఎస్ఎం వర్గంగా మొదటినుంచి కొనసాగుతుండడంతో సైలెంట్‌గా ఆయన ద్వారా తన ప్రయత్నాలు తాను చేసుకుంటున్నారు. వైసీపీనుంచి టీడీపీలోకి జంప్ అయిన నలుగురు కౌన్సిలర్లు కూడా తమలో ఒకరికి చైర్మన్ పదవి ఇవ్వాలని అక్కడా ఇక్కడా చెప్పుకుంటూ తిరుగుతున్నారు. అయితే టీడీపీలో మొదటినుంచి కష్టపడినవారికే పదవులు, అవకాశాలు ఉంటాయని అధినేత చంద్రబాబు చాలాసార్లు స్పష్టంగా చెప్పడంతో టీడీపీ కౌన్సిలర్లలో ఎవరో ఒకరికి మున్సిపల్ చైర్మన్ పదవి లభించే అవకాశమే అధికంగా ఉంది. అధిష్ఠానం మాత్రం ఈ విషయంలో గుంభనంగా ఉంది. ఈ ఏడాది ఫిబ్రవరి 5వ తేదీన కంగుందిలోని పీఎస్ఎం ఫాం హౌస్‌లో జరిగిన రహస్య సమావేశంలో మున్సిపల్ చైర్మన్ విషయంలో అధినేత చంద్రబాబుదే తుది నిర్ణయమని, ఎమ్మెల్సీ కంచర్ల స్పష్టంగా చెప్పినట్లు సమాచారం. చైర్మన్ అభ్యర్థి పేరు సీల్డ్ కవర్‌లో పంపుతారని, దాన్ని ఆమోదించి తీరాలని కూడా ఈ సమావేశంలో పార్టీ పెద్దలు స్పష్టం చేసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో చైర్మన్‌గిరీ ఎవరిని వరించనుందన్న విషయంలో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

● కోరం ఉండాలంటే

మున్సిపల్ చైర్మన్ పదవికి ఎన్నిక జరిగితే 16వ వార్డు ఖాళీగా ఉంది కాబట్టి 24 మంది కౌన్సిలర్లు, ఎక్స్ అఫిషియో సభ్యులుగా టీడీపీ, వైసీపీ ఎమ్మెల్సీలు కంచర్ల శ్రీకాంత్, భరత్.. మొత్తం కలిపి 26 మంది సభ్యులవుతారు. కౌన్సిల్ సమావేశ నిర్వహణకు అవసరమైన కోరం ఉండాలంటే కనీసం 13మంది కౌన్సిలర్లు హాజరు కావాల్సి ఉంటుంది. ఇప్పటికే టీడీపీకి 10 మంది కౌన్సిలర్లున్నారు. అంటే ఇంకా ముగురు కౌన్సిలర్లు అవసరమవుతారు. ఇందులో ఎమ్మెల్సీ కంచర్ల ఎక్స్ అఫిషియో సభ్యుడిగా హాజరైతే ఈ సంఖ్య రెండుకు తగ్గుతుంది. ఆ ఇద్దరినీ ఇటువైపు లాక్కోవడమో లేక ఏదైనా కారణంవల్ల మొత్తం వైసీపీ కౌన్సిలర్లు హాజరు కాకుండా ఉండడమో జరిగి తీరాలి. ఈ రెండు పద్ధతుల్లో ఏ పద్ధతి ఎంచుకుంటారన్నది అధికార పార్టీ ఇంకా తేల్చుకోలేదని తెలుస్తోంది. మొన్న రామకుప్పంలో ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికల్లో గెలిచి కూడా చివరి నిమిషం వరకు ఉత్కంఠను ఎదుర్కోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రతిష్ఠాత్మకమైన కుప్పం మున్సిపల్ చైర్మన్ ఎన్నికల్లో అటువంటి పరిస్థితి పునరావృతం కావద్దని అధినేత చంద్రబాబు, స్థానిక నాయకత్వాన్ని హెచ్చరించినట్లు సమాచారం. చివరకు ఏం జరుగుతుందో వేచి చూడాల్సిందే.

క్యాన్సర్ పట్ల ఆందోళన వద్దు


క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించిన మహిళలు

తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్22 (ఆంధ్రజ్యోతి): మహిళలు క్యాన్సర్ పట్ల ఆందోళన చెందవలసిన అవసరంలేదని డాక్టర్లు కె.సునీత, జ్యోత్స్న పేర్కొన్నారు. మంగళవారం మంగళంలో రాస్, శ్రీవేంకటేశ్వర మెడికల్ కళాశాల, ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి వైద్యు లు సంయుక్తంగా మహిళలు ఆరోగ్యం పట్ల తీసుకోవలసిన అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. క్యాన్సర్ నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. వ్యక్తిగత శుభ్రత, పోషకాహారం గురించి వివరించారు. అనంతరం 42మంది రాస్ పొదుపు సంఘాల మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. ఈ సదస్సులో డాక్టర్లు స్రవంతి, పల్లవి, హరిణిక, మానస, దామిని, శ్రావ్య, రాస్ సిబ్బంది, నాగేశ్వర్, రాధ, బాలాజీ, చంద్రకళ, సుశీల తదితరులు పాల్గొన్నారు.

కరాటే క్రీడాకారులకు శాప్ చైర్మన్ అభినందనలు


కరాటే క్రీడాకారులను అభినందించిన శాప్ చైర్మన్

తిరుపతి(క్రీడలు), ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీ వేదికగా వచ్చే నెల 15 నుంచి జరగనున్న 5వ జాతీయ జూనియర్ జట్టు కరాటే పోటీ ల్లో ప్రాతినిథ్యం వహించనున్న క్రీడాకారులను శాప్ చైర్మన్ రవినాయుడు అభినందించారు. స్థానిక చింతకాయల వీధికి చెందిన కరాటే క్రీడాకారులు డి.విష్ణుప్రియ, డి.విద్యశ్రీ, డి.హర్షిత, డి.అభినార్ జాతీయస్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం శ్రీనివాస క్రీడాసముదాయంలో శాప్ చైర్మన్‌ను వారు మర్యాదపూర్వకంగా కలిసారు. క్రీడాకారులను ఆయన ఘనం గా సత్కరించారు. జాతీయ స్థాయిలో విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు.

డీఎస్సీతో నిరుద్యోగుల కళ్లలో వెలుగులు



తిరుపతి(జీవకోన), ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ నోటిఫికేషన్‌తో నిరుద్యోగుల కళ్లల్లో వెలుగులు నిండాయని నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం అన్నారు. మంగళవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇచ్చిన మాట ప్రకారం సీఎం చంద్రబాబు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు. అలాగే యువగళం పాదయాత్రలో ప్రస్తుత మంత్రి లోకేశ్ మెగా డీఎస్సీ ఇస్తామని ప్రకటించారని గుర్తుచేశారు. టీడీపీ మ్యాని ఫెస్టోలో సైతం డీఎస్సీని చేర్చారని పేర్కొన్నారు. ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కుమా రమ్య, రజక కార్పొరేషన్ డైరెక్టర్ కరాటే చంద్ర, శాలివాహన విభాగం పార్లమెంటు కన్వీనర్ ఆముదాల తులసీదాస్, రజక సంఘం రాష్ట్ర నాయకులు అక్కినపల్లి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సప్తగిరుల ప్రదక్షిణ


సప్తగిరుల ప్రదక్షిణను జెండా ఊపి ప్రారంభిస్తున్న ప్రముఖులు

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): 4వ తిరుమల సప్తగిరుల ప్రదక్షిణ యాత్రను మంగళవారం నిర్వహించారు. తిరుపతి అలిపిరి సమీపంలోని భారతీయ విద్యాభవన్ మైదానంలో ఎంపీ, కేంద్ర పార్లమెంటరీ ఎస్సీ ఎస్టీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ ఫగ్గన్ సింగ్ కులస్తె ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. తిరుమల ఏడు కొండలు చుట్టేస్తూ వాహనంలో తిరుపతి, భాకరాపేట, రాయచోటి, రాజంపేట మీదుగా ప్రదక్షిణ పూర్తి చేసి రాత్రి కపిలతీర్థం వద్ద యాత్రను ముగించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు భానుప్రకాష్ రెడ్డి, ఐఎంఎ జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ శ్రీహరిరావు, బీజేపీ జిల్లా సాంస్కృతిక మండలి అధ్యక్షులు గుండాల గోపినాథ్ రెడ్డి, మంత్రపీఠ పీఠాధిపతి స్వామి నరసింహ సింహయాజులు, నిర్వాహకులు ఆదినారాయణ, సచ్చిదానంద, హనుమంత నాయక్, స్వామీజీలు, భక్తులు పాల్గొన్నారు.

రుయా వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతి


రుయా వద్ద మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

తిరుపతి (నేరవిభాగం) ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): తిరుపతి రుయా ఆస్పత్రి వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. వెస్ట్ సీఐ మురళీమోహన్ కథనం మేరకు.. కొంతకాలంగా రుయా పరిసర ప్రాంతాల్లో ఓ వ్యక్తి యాచిస్తూ జీవించేవాడు. మంగళవారం ఓపీ వద్ద మృతిచెందాడు. ఎండ వేడి భరించలేక మృతిచెంది ఉంటాడు. అతడి వద్ద ఎలాంటి ఆధారాలూ లేకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తిగా భావించి మృతదేహాన్ని రుయా మార్చురీకి తరలించారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు వెస్ట్ సీఐ 9440796750ను సంప్రదించవచ్చు.

నాగూర్‌కాలనీ పాఠశాల వార్షికోత్సవం


విద్యార్థులతో ఎంఈవో జయవేలు, హెచ్ఎం రాజేశ్వరి తదితరులు

తిరుపతిరూరల్, ఏప్రిల్22(ఆంధ్రజ్యోతి): తిరుపతిరూరల్ మండలం కుంట్రపాకం పంచాయతీ నాగూరుకాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా 5వతరగతి విద్యార్థులకు గ్రాడ్యుయేషన్‌డే నిర్వహించారు. విద్యార్థులు కాన్వొకేషన్ దుస్తులు ధరించి సర్టిఫికెట్లు అందుకున్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్‌సీపురం మండలవిద్యాధికారి-2 జయవేలు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవాన్ని నిర్వహించడం సంతోషంగా ఉందని అభినందించారు. హెచ్ఎం వి.రాజేశ్వరి మాట్లాడుతూ క్రమశిక్షణ అలవర్చుకుని మంచి పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. పాఠశాల కమిటీ చైర్మన్ బి.షాహిదా, టీచర్ ఎం.రాజేశ్వరి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పరిశోధనా ఫలాలు రైతుల చెంతకు చేర్చాలి

ఐసీఏఆర్ డిప్యూటీ డైరెక్టర్ రాజ్‌బీర్‌సింగ్



సదస్సులో పాల్గొన్న రాజ్‌బీర్‌సింగ్ తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పరిశోధనా ఫలితాలు రైతుల చెంతకు చేర్చాలని జాతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థ (ఐసీఏఆర్) డిప్యూటీ డైరెక్టర్ రాజ్‌బీర్‌సింగ్ పేర్కొన్నారు. ఎస్వీ వ్యవసాయ కాలేజీలో అగ్రిటెక్‌పై మంగళవారం చేపట్టిన రెండు రోజుల జాతీయ సదస్సులో ఆయన ప్రసంగించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, పరిశోధనా కేంద్రాల మధ్య సమన్వయం అవసరమన్నారు. పరిశోధనల్లో రైతుల అనుభవాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ఆధునిక సాంకేతికత వినియోగంపైనా, ఆహార భద్రతపైనా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వీసీ శారదజయలక్ష్మి మాట్లాడుతూ వ్యవసాయ రంగంలోని సవాళ్లు, పరిష్కారాలపై వ్యవసాయ విద్యార్థులు అవగాహన పెంచుకోవాలన్నారు. మరట్వాడా కృషి విద్యాపీఠం వీసీ ఇంద్రామణి మాట్లాడుతూ.. పోషక ఆహార ఉత్పత్తుల తయారీని వేగవంతం చేయడానికి టెక్నాలజీని ఉపయోగించుకోవాలన్నారు. తంజావూరు నిఫ్టీ డైరెక్టర్ ముత్తు మాట్లాడుతూ వ్యర్థాలతో ఉత్పత్తులను తయారు చేయడం ద్వారా ఎంటర్‌ప్రైజెస్‌ను ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీన్ రమణ, ఆర్ఏఆర్ఎస్ ఏడీ సుమతి, నిర్వాహకులు సుబ్రమణ్యం, కల్యాణి, మోహన్, బాలాజీ, హైదరాబాదు ఇక్రిసాట్ శాస్త్రవేత్తలు హరికిషన్, మనీష్‌పాండే, అధ్యాపకులు, విద్యార్థులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

రుణదాతల ఒత్తిళ్లు భరించలేక కారు డ్రైవర్ పరారీ

తిరుపతి(నేరవిభాగం) ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): తిరుపతి పరిధిలో ఒక కారు డ్రైవర్ అప్పులవారి ఒత్తిళ్లు భరించలేక ఇంటినుంచి వెళ్లిపోయాడు. డ్రైవర్ భార్య శ్రీలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. తిరుపతి ఎస్వీయూనివర్శిటీ పరిధిలోని ఉల్లిపట్టెడలో కాపురమున్న రవి పలువురి వద్ద అప్పులు చేశాడు. అప్పు ఇచ్చినవారి నుంచి ఒత్తిళ్లు ఎక్కువయ్యాయి. దీంతో ఇంటినుంచి వెళ్లిపోయాడు. భార్య ఫిర్యాదు మేరకు సీఐ రామయ్య కేసు నమోదు చేశారు.

ఘనంగా పురందేశ్వరి జన్మదినం

తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి జన్మదినోత్సవాన్ని ఆ పార్టీ నాయకులు తిరుపతిలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. గుండాల గోపీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక వినాయక సాగర్‌లోని సంకల్ప వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జీఎస్ మాడ వీధిలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు కట్టమంచి చంద్రబాబుయాదవ్, పగడాల ప్రభాకర్ నాయకుడు, తొండమనాటి సుబ్రహ్మణ్యంరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, కరణ్‌సింగ్, హేమంత్, చంద్రారెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అరటికాయల అలంకరణలో గంగమ్మ దర్శనం



తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతర ముందు రెండో మంగళవారం గంగమ్మ విశేషాలంకరణలో దర్శనం ఇచ్చింది. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. తర్వాత అరటిపండ్లతో గంగమ్మను అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయం వద్ద మహిళలు, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అంబళ్లు పోసి మొక్కులు తీర్చుకున్నారు.

ఎంఎల్‌హెచ్‌పీల సమస్యలు పరిష్కరించాలి

డీఎంహెచ్‌వో కార్యాలయం ముందు నిరసన



డీఎంహెచ్‌వో కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీలు

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఎంఎల్‌హెచ్‌పీ (మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్స్), సీహెచ్‌వోల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని జిల్లాలోని ఎంఎల్‌హెచ్‌పీ, సీహెచ్‌వోలు డిమాండ్ చేశారు. జిల్లాలోని ఎంఎల్‌హెచ్‌పీలు మంగళవారం స్థానిక జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ హెచ్‌పీల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సుమంత్ మాట్లాడుతూ ఎన్‌హెచ్ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సరవణ చేయాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈపీఎఫ్ పునరిద్ధరించాలన్నారు. క్లినికల్ అద్దె బకాయిలను చెల్లించాలని, నిర్దిష్టమైన జాబ్ చార్టును అందించాలని కోరారు. ఎఫ్ఆర్ఎస్ హాజరు నుంచి మినహా యింపు ఇవ్వాలని, హెచ్ఆర్ పాలసీ, ఇంక్రిమెంట్లు, ట్రాన్స్‌ఫర్లు వంటివి కల్పించాలని విన్నవించారు. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించే వరకు నిరసనలు కొనసాగిస్తామని స్పష్టంచేశారు. అనంతరం డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి బాలాజీకాలనీ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని అన్నీ పీహెచ్‌సీల పరిధిలోని ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

పోరాటం కొనసాగిస్తాం



మొదట ఎంఎల్‌హెచ్‌పీలుగా మమ్మల్ని తీసుకున్నారు. తర్వాత సీహెచ్‌వో (కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్)లుగా గుర్తింపు ఇచ్చారు. కానీ సాధారణ ఉద్యోగులకు కల్పించే సదుపాయాలు ఏవీ మాకు కల్పించలేదు. మా సమస్యలను పరిష్కరించే వరకు పోరాటం కొనసాగిస్తాం.

- సుమంత్, ఎంఎల్‌హెచ్‌పీల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

క్షేత్రస్థాయిలో ఉంటే ఎఫ్ఆర్ఎస్ హాజరు ఎలా వేయగలం?



నిత్యం క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే మేము ప్రతిరోజూ ఒకే సమయానికి ఒకే దగ్గర ఎలా ఎఫ్ఆర్ఎస్ హాజరు వేయాలో అర్థం కావడం లేదు. మారుమూల గ్రామాల్లో నెట్‌వర్క్ లేక ఎఫ్ఆర్ఎస్ పడడం లేదు. దీంతో హాజరు వేయలేకున్నాం. ఈ విషయాన్ని మెడికల్ ఆఫీసర్ల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదు.

- మేరీకృప, ఎంఎల్‌హెచ్‌పీల అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షురాలు

ఏపీ సీడ్స్‌లో తనిఖీలు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏపీ సీడ్స్‌ను మంగళవారం వి త్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ మన్నే సుబ్బారెడ్డి తనిఖీ చేశారు. అంతకు ముందు ఆయన శ్రీకాళహస్తీశ్వర స్వామిని దర్శించుకున్నారు. సంస్థ స్థితిగతులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీ సీనియర్ నాయకుడు, మా ర్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రంగి నేని చెంచయ్యనాయుడు, బీజేపీ నాయకుడు మేళాగారం సుబ్రహ్మణ్యంరెడ్డి ఆయనను మ ర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. అ నంతరం కార్మికులకు ఎక్కువ పనిదినాలు కల్పించి సంస్థ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అదే విధంగా రైతులకు సకాలంలో నాణ్యమైన విత్తనాలు అందించాలని కోరారు. సంస్థ అభి వృద్ధిలో రైతులను భాగస్వామ్యం చేయాల న్నారు. అనంతరం కార్మిక సంఘ నాయకులు ఈశ్వర్‌రెడ్డి, వి.మునెయ్య, గురవయ్య, మోహన్ రెడ్డితో కలిసి వినతిపత్రం అందజేశారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం: టీడీపీ

- దాడికి గురైన వెంకటేష్‌కు పలువురి పరామర్శ


వెంకటేష్(ధోని)ని పరమార్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, డిప్యూటీ మేయర్ ఆర్‌సీ మునికృష్ణ తదితరులు

తిరుపతి(జీవకోన), ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్తలకు అన్నివిధాలా అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, డిప్యూటీ మేయర్ ఆర్‌సీ మునికృష్ణ పేర్కొన్నారు. నగర పరిధిలోని మిట్టూరులో శ్రీరామనవమి ఊరేగింపు సమయంలో కొందరు వైసీపీ నాయకులు ఒకటవ డివిజన్ టీడీపీ ప్రెసిడెంట్ వెంకటేష్(ధోని)పై కత్తితో దాడి చేశారు. గాయపడిన వెంకటేష్ రుయాలో చికిత్స తర్వాత ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ క్రమంలో టీడీపీ నాయకులు మంగళవారం వారింటికెళ్లి అతడిని పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని అండగా ఉంటామని అతడి కుటుంబసభ్యులకు భరోసానిచ్చారు. అనంతరం దాడి జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. పరామర్శించిన వారిలో టీడీపీ నాయకులు దంపూరు భాస్కర్‌యాదవ్, బుల్లెట్ రమణ, బి.జి. కృష్ణయాదవ్, మన్యం శ్రీనివాసులు, మునిశేఖర్‌రాయల్, బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, ఆర్‌సీ శ్రీనివాసులు, పుష్పావతి, విశ్వనాథం, రాజారాం, రుయా ఆస్పత్రి డైరెక్టర్ కరణం సందీప్, నరేష్‌రెడ్డి పాల్గొన్నారు.

అమర హాస్పిటల్లో సెప్సిస్‌పై మెడికల్ కాన్ఫరెన్స్



మెడికల్ కాన్ఫరెన్స్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న రమాదేవి

రేణిగుంట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరకంబాడి వద్ద ఉన్న అమర హాస్పిటల్లో మంగళవారం ఉదయం కంబాట్ సెప్సిస్, మాస్టరింగ్ సెప్సిస్ మేనేజ్మెంట్, టైలరింగ్ యాంటీబయోటిక్ థెరపీపై రాష్ట్ర స్థాయి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రముఖ వైద్యులు అల్లాడి మోహన్, అలోక్, రాధా, మదన్మోహన్‌రెడ్డి, సుబ్బారావు, ప్రవీణ్, ఇన్‌ఫెక్షన్ డిసీజ్ స్పెషలిస్ట్ డాక్టర్ శ్రీనివాస్‌కర్, విజయ్‌కుమార్, మోనాలిసా సాహు తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కాన్ఫరెన్స్‌లో సెప్సిస్ నిర్వహణలో వైద్య పరమైన నైపుణ్యాన్ని పెంపొందించడం, యాంటీ బయోటిక్స్ హేతుబద్ధమైన ఉపయోగంపై ప్రముఖంగా చర్చించారు. ఆరోగ్య సంరక్షణలో నిరంతర పరిశోధన ప్రాముఖ్యాన్ని ప్రస్తావించారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్ విద్యార్థులు, అధ్యాపకులు, ప్రాక్టీస్ చేసే వైద్యుల సహా 400 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎస్‌సీసీఎం అధ్యక్షుడు డాక్టర్ హరికృష్ణ, జనరల్ సెక్రటరీ రాణా ప్రతాప్ సింహా, అమర హాస్పిటల్ వైద్యులు రవికుమార్, శంకర్, అరుణ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధరిత్రి దినోత్సవం


పద్మావతి వర్శిటీలో సైన్స్ సిటీ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, వీసీ ఉమ తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీలు, కాలేజీల్లో ధరిత్రి దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ● ఎస్వీయూ- సెట్విన్ సంయుక్తంగా ఫార్మసీ కాలేజీలో నిర్వహించిన కార్యక్రమంలో వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, సెట్విన్ సీఈవో మోహన్‌కుమార్, కల్చరల్ కో-ఆర్డినేటర్ పత్తిపాటి వివేక్, ఫార్మసీ ప్రిన్సిపాల్ ఓవీఎస్ రెడ్డి మాట్లాడారు. మనకు గాలి, నీరు, ఆహారం లభించడానికి కారణం భూమి అన్నారు. అలాంటి భూమిని కాలుష్య కోరల నుంచి భూమాతను కాపాడుకోవాలన్నారు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలన్నారు. ● పద్మావతి వర్సిటీ సావేరీ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, పద్మావతి వర్సిటీ వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని, ఏపీ సైన్స్ సిటీ సీఈవో కేశినేని వెంకటేశ్వర్లు, పర్యావరణ కార్యకర్త శివాజీ పాల్గొని మాట్లాడారు. ప్రకృతిని కాపాడుకుంటేనే మనిషికి మనుగడ ఉంటుందన్నారు. పద్మావతి వర్సిటీలో సైన్స్ పార్క్ ఏర్పాటు జరిగేలా చూస్తామన్నారు. ● పద్మావతి డిగ్రీ కాలేజీలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నారాయణమ్మ, ఎన్ఎస్ఎస్ అధికారి కృష్ణవేణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. వాతావరణ కాలుష్యాన్ని తగ్గించాలని కోరారు.

లెనిన్ ఆశయాలను కొనసాగిద్దాం

తిరుపతి(ఆటోనగర్) ఏప్రిల్22(ఆంధ్రజ్యోతి): సమ సమాజ నిర్మాత కామ్రేడ్ లెనిన్ ఆశయసాధన కోసం యువతరం ముందుకు రావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.హరినాథరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక బైరాగిపట్టెడలోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం లెనిన్ 155 జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటం పెట్టి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేకత విధానాలను యువత అడ్డుకోవాలని, ప్రజాపోరాటాల్లో పాలొనాలని కోరారు. పార్టీ జిల్లా కార్యదర్శి పి.మురళి, నాయకులు రాధాక్రిష్ణ, ప్రసాద్, ఎన్‌డి రవి, కేవై రాజా, బి.చలపతి, రామక్రిష్ణ, అల్లాబకష్ పాల్గొన్నారు.

కోలాహలంగా హాస్టల్ డే


ప్రసంగిస్తున్న వీసీ ఉమ



అలరించిన వెస్ట్రన్ డ్యాన్స్


మైమరిపించిన నృత్యప్రదర్శన

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి యూనివర్సిటీ విద్యార్థి హాస్టల్ జ్ఞాపకాలు జీవితాంతం సజీవంగా ఉంటాయని పద్మావతి యూనివర్సిటీ వీసీ ఉమ పేర్కొన్నారు. యూనివర్సిటీ ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించిన హాస్టల్ డేలో ఆమె మాట్లాడారు. హాస్టల్ జీవితం అద్భుత జ్ఞాపకాలతో నిండిన దన్నారు. విద్య, అనుభవం, స్నేహబంధాలు ఏర్పడతాయన్నారు. రిజిస్ట్రార్ రజని మాట్లాడుతూ యూనివర్సిటీ హాస్టళ్లను పరిశుభ్రంగా, ఆహ్లాదంగా మార్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. వార్డెన్ సావిత్రి మాట్లాడుతూ హాస్టల్ విద్యార్థులందరూ ఒకే కుటుంబంగా మెలిగేలా చూశామన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి.

తిరుమలలో తమిళనటుడు విజయ్‌కుమార్



తమిళ సినీనటుడు విజయ్‌కుమార్ మంగళవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో కుమార్తె, నటి శ్రీదేవి, కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనం అనంతరం ఆలయం బయట నటి శ్రీదేవి మాట్లాడుతూ.. ప్రతి ఏడాది కుటుంబ సభ్యులతో తిరుమలకు రావడం ఆనవాయితీగా వస్తోందన్నారు. నారా రోహిత్‌తో నటించిన 'సుందరకాండ' త్వరలో విడుదల కాబోతోందని చెప్పారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

మాడవీధుల్లో చల్లదనం కోసం..



ఆలయం ముందు నీళ్లు వదులుతున్న ట్యాంకర్

చల్లని తిరుమల కొండ కూడా ఎండకు వేడెక్కిపోతోంది. మాడవీధుల్లో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. టీటీడీ ఇప్పటికే కూల్‌పెయింట్ వేసింది. తాత్కాలిక షెడ్లు నిర్మించింది. మాడవీధుల్లో గ్యాలరీల వెంబడి గ్రీన్ తెరతో పైకప్పులను ఏర్పాటు చేశారు. అయినా బండలు పరిచిన నేల సెగలు కక్కుతూనే ఉంది. దీంతో ప్రతి రెండు గంటలకోసారి ఆలయ నాలుగు మాడవీధులు, పరిసర ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని నిరంతరాయంగా చల్లుతున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

సర్వదర్శనానికి 6 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 6 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 8 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 2 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.4.79కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 72,937

తలనీలాలు సమర్పించినవారు: 24,157

● నేడు ప్రపంచ పుస్తక దినోత్సవం

పుస్తకం చిన్నబోతోంది..



నడిపేది..నడిపించేది.. పెను నిద్దుర వదిలించేది.. సమగ్ర వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దేది.. నిరంతరం మార్పు వైపు నడిపించేది పుస్తకం. నిజమే కానీ నేటి ఆధునికత పుస్తకాన్నీ ప్రభావితం చేస్తోంది. చదువరులను తగ్గించేస్తోంది. పుస్తక పఠనమే వ్యక్తిగత అభివృద్ధికి సోపానమనే విషయాన్ని విస్మరిస్తోంది. తద్వారా నేటి యువత చాలా నష్టపోతోందని పలువురు రచయితలు, మేధావులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పుస్తకాన్ని దగ్గరకు తీసుకోవాల్సిన అవసరాన్ని వీరు నొక్కివక్కాణిస్తున్నారు. పఠనంతో మంచి జీవితానికి బాటలు వేసుకోవచ్చునని హితవు పలుకుతున్నారు. పుస్తకాలను పక్కకు నెట్టి ఎలక్ట్రానిక్ పరికరాలతో కాలక్షేపం చేస్తే భవిష్యత్తుకు ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వీటికి అతుక్కుపోయి ఒత్తిడి, మానసిక సమస్యలు,అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారని గుర్తు చేస్తున్నారు. బుధవారం ప్రపంచ పుస్తకదినోత్సం సందర్భంగా పలువురు రచయితలు ఏమంటున్నారంటే...


- తిరుపతి(కల్చరల్), ఆంధ్రజ్యోతి

తలదించుకుని చదివితే తలెత్తుకునేలా....

పుస్తకాన్ని తలదించుకుని చదివితే జీవితాంతం తలెత్తుకునేలా చేస్తుంది. చదివేకొద్ది జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చు. విద్యార్థుల్లో పఠనాశక్తిని పెంపొందించడానికి గత రెండు సంవత్సరాలుగా బాలల నేస్తం పేరుతో మాసపత్రికను రూపొందిస్తున్నాం. ఇందులో పిల్లలు రాసిన బాలసాహిత్య కథలు, గేయాలు, చిత్రాలు సృజనాత్మకత అంశాలతో ఎందరో విద్యార్థులను పఠనం వైపు తీసుకెళ్తున్నాం. పిల్లలకు కథల ద్వారా లోకంలో ఉన్న మంచి చెడులు తెలుస్తాయి. పుస్తక పఠనం దినచర్యలో భాగం కావాలి.

- యువశ్రీ మురళి, అరసం జిల్లా అధ్యక్షులు

వ్యక్తిత్వం, విలువలు పెరుగుతాయి...



పుస్తక పఠనం వల్ల మనిషిలోని వ్యక్తిత్వం, విలువలు పెరుగుతాయి. జీవిత చరిత్రలు చదివితే మనిషి మనిషిగా ఎదగడమే కాక తనను తాను మంచి వ్యక్తిగా తయారు చేసుకుంటాడు. గతంలో గ్రంథాలయాలకు వెళ్లి ఇతిహాసాల నుంచి అనేక రకాల పుస్తకాలను చదవడం వల్ల ధర్మం నాలుగు పాదాలపై నిలబడిందనుకుంటాను. ఇప్పుడు ఇంట్లో అందరూ సెల్‌ఫోన్లు పట్టుకుని తమ లోకంలో ఉండిపోతున్నారు. దీనివల్ల పిల్లలకు కంటిచూపు దెబ్బతింటోంది. కళ్లజోళ్ల పరిస్థితి వస్తోంది

- పేరూరు బాలసుబ్రహ్మణ్యం, కథా రచయిత



పుస్తక పఠనం అదృష్టం

విద్యార్థుల్లో పుస్తకాలు చదవడం తగ్గిపోయింది. ఇది చాలా బాధాకరం. పుస్తక పఠనం వ్యక్తిని ఎప్పుడూ చురుకుదనంతో ఉంచుతుంది. నాకిప్పుడు 70 ఏళ్లు. 35 పుస్తకాలు రాశాను. సాహితీవేత్తలతో మమేకమవుతుంటాను. రోజూ ఏదో ఒక పుస్తకం చదవడం వల్ల ఉత్సాహంగా ఉంటున్నాను. చిన్న చిన్న ప్రయాణాల్లో సైతం తోడుగా ఎల్లప్పుడూ పుస్తకాలు ఉంటాయి. పుస్తకాలు చదవడం ప్రతిఒక్కరూ బాధ్యతగా చేసుకోవాలి. పుస్తక పఠనం దక్కిందంటే అదృష్టంగా భావించాలి.

- డాక్టర్ త్యాగదుర్గం మౌని, సాహిత్యవేత్త



తోడు నిలిచే నేస్తం పుస్తకం...



పుస్తకం జ్ఞానాన్ని పెంచే నిధి అక్షరాలను అందంగా దాచుకొన్న తరగని గని. తోడు నిలిచే నేస్తం. కానీ పుస్తక పఠనం నేటి యువతకు దూరమవుతోంది. సెల్‌ఫోన్ వాడటం తప్పుకాదు గానీ దానిని ఎంత వరకు వాడాలో అంతవరకే వాడాలి. తల్లిదండ్రులు చిన్నతనం నుంచి పుస్తక పఠనం వైపు దారి మళ్లించాలి. పిల్లలను సమయం దొరికినప్పుడల్లా మంచి పుస్తకాలను చదివించాలి. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన వారంతా పుస్తకాల ప్రేరణ పొందారని గమనించాలి.

- మూరిశెట్టి గోవింద్, కథ, నవలా రచయిత





రుయా.. చూపాలిలా దయ



భానుడు చెలరేగిపోతున్నాడు.నిప్పులు చెరుగుతున్నాడు. సాధారణ ప్రజలే ఈ ఎండల తాకిడికి అల్లాడిపోతుంటే మరి రోగుల పరిస్థితి మాటేంటి.. ఈక్రమంలోనే రుయాస్పత్రిలో తీసుకున్న చర్యలు వేసవి తాపం నుంచి ఉపశమనం కలిగిస్తున్నాయి. వీల్ చైర్లు, స్ట్రెచర్లపై రోగులను తీసుకువెళ్లేవారికి ఊరటనిస్తున్నాయి. ఆస్పత్రిలోని అంతర్గత మార్గాల్లో ఎండ తగలకుండా ఏర్పాటు చేసిన పచ్చని పందిళ్లు రక్షణగా నిలుస్తున్నాయి. చెప్పులు కూడా లేకుండా వచ్చే రోగులకు సైతం ఇవి ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఈ విధమైన ఆలోచనకు శ్రీకారం చుట్టిన ఆస్పత్రి అధికారులకు రోగులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

- తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి

సహజ వనరుల వెలికితీతలో అప్రమత్తం

● అంతర్జాతీయ సదస్సులో శాస్త్రవేత్త బలరాం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): అరుదైన సహజ వనరుల సద్వినియోగంలో చైనాను మన దేశం అధిగమించవలసి ఉందని హైదరాబాదులోని నేషనల్ జియోలాజికల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ (ఎన్‌జీఆర్ఐ) ముఖ్య శాస్త్రవేత్త డాక్టర్ వి. బలరాం పేర్కొన్నారు. ఎస్వీయూ ఫిజిక్స్- పద్మావతి వర్సిటీ బయో టెక్నాలజీ విభాగాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ సదస్సు రెండవ రోజు(మంగళవారం) కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఎస్వీయూ సెనేట్ హాలు వేదిక జరిగిన సదస్సులో బలరాం మాట్లాడుతూ మన దేశంలో లభించే అరుదైన మూలకాలను వెలికితీసే, వినియోగించుకునే అంశాల్లో మార్పులు రావాలన్నారు. యురేనియం వంటి సహజ వనరులను వెలికి తీసే బాధ్యతను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం మంచిది కాదన్నారు. లేకపోతే,ఈ మూలకాల నుంచీ వెలువడే వ్యర్థాలు క్యాన్సర్, కిడ్నీ జబ్బులకు కారణమవుతాయన్నారు. ఢిల్లీ తరహా కాలుష్యాన్ని కూడా ఎదుర్కొనాల్సి వస్తుందన్నారు. హైదరాబాదు బిట్స్ పిలానీ ప్రతినిధి డాక్టర్ బీఎం రెడ్డితో పాటు పలువరు శాస్త్రవేత్తలు, పరిశోధకులు పేపర్, ఓరల్, పోస్టర్ ప్రెజెంటేషన్స్ చేశారు. వీరిని అంతర్జాతీయ సదస్సు కన్వీనర్ ప్రొఫెసర్ దేవప్రసాదరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రొఫెసర్ జాన్‌సుష్మా సర్టిఫికేట్, జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో రేర్ ఎర్త్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ దీపేంద్రసింగ్, కార్యదర్శి డాకక్టర్ ఎంఎల్‌పీ రెడ్డి, ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ సీకే జయశంకర్ తదితరులు పాల్గొన్నారు.





సదస్సులో ప్రసంగిస్తున్న డాక్టర్ బలరాం

నేడు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పర్యటన

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎస్ఎంఈ, సెర్ఫ్, ఎన్ఆర్ఐ ఎంపవర్మెంట్, రిలేషన్స్‌శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ బుధవారం తిరుపతి జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 23న ఉదయం 9గంలకు శ్రీసిటీని సందర్శించి 11.30గంటల వరకు శ్రీసిటీ ఎండీ, శ్రీసిటీ ఎంఎస్ఎంఈ, అంబత్తూరు ఇండస్ట్రియల్ తదితర అసోసియేషన్ వారితో సమావేశం అవుతారన్నారు. అనంతరం 2గంటలరే తిరుపతికి బయలుదేరి కలెక్టరేట్‌లో 3 నుంచి 6 గంటల వరకు ఎస్ఎంఈశాఖ పనితీరుపై తిరుపతి, చిత్తూరు జిల్లా లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులు, ఎఫ్ఎస్ఎంఈ అసోసియేషన్, ఛాంబర్ఆఫ్ కామర్స్ వారితో జరిగే సమావేశంలో పాల్గొంటారన్నారు. అనంతరం కడపకు బయలుదేరి వెళ్లతున్నట్లు తెలిపారు

ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఏపీవో దాడి

● మస్టర్లలో సంతకాల విషయమై వివాదం



గాయపడిన చంద్రశేఖర్


పెళ్లకూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మస్టర్లలో సంతకాల విషయమై వివాదం చెలరేగడంతో ఉపాధి హామీ ఫిల్డ్ అసిస్టెంట్‌పై ఏపీవో దాడి చేసిన ఘటన మంగళవారం పెళ్లకూరు ఉపాధి కార్యాలయంలో చోటు చేసుకుంది. పునబాక పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ ఉపాధి పనుల మస్టర్లపై సంతకాలు చేయాలని ఏపీవో దయానందంను కోరారు. అందుకు ఆయన అంగీకరించక పోవడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో ఆగ్రహానికి లోనైన దయానందం తాను భోజనం తెచ్చుకున్న క్యారీ బాక్స్‌తో చంద్రశేఖర్‌పై దాడి చేశాడు. గాయపడిన చంద్రశేఖర్ స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స తీసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తిరుపతి- విశాఖ మధ్య వేసవి ప్రత్యేక రైళ్లు

తిరుపతి(సెంట్రల్), ఏప్రిల్22(ఆంధ్రజ్యోతి): వేసవి రద్దీని దృష్టిలో ఉంచుకొని దక్షిణ మధ్య రైల్వే వివిధ ప్రాంతాలకు మే 5 నుంచి జూలై ఒకటి వరకు ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు సీపీఆర్వో ఎ.శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్టణం- తిరుపతి మధ్య 18 సర్వీసులు నడుస్తాయి. మే 5 నుంచి ప్రతి సోమవారం విశాఖపట్టణంలో ప్రత్యేక రైలు(08583) బయలుదేరి తిరుమల ఎక్స్‌ప్రెస్ మార్గంలో ప్రయాణిస్తూ మరుసటి రోజు తిరుపతికి చేరుకొంటుంది. ఈ ప్రత్యేక రైలు(08584) మే 6 నుంచి, ప్రతి మంగళవారం తిరుపతిలో బయలుదేరి విశాఖ చేరుకొంటుంది.

సరికొత్త హంగులతో శ్రీనివాస క్రీడా సముదాయం





మల్టీపర్పస్ స్పోర్ట్స్ ఎరీన - సిద్ధమైన రైఫిల్ షూటింగ్ కేంద్రం

● ఆధునికీకరణ పనులు పూర్తి

● నేడు ప్రారంభించనున్న మంత్రి

తిరుపతి(క్రీడలు), ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని శ్రీనివాస క్రీడా సముదాయం సరికొత్త హంగులతో ముస్తాబైంది. శిథిలావస్థకు చేరుకున్న ఈ సముదాయాన్ని కూటమి ప్రభుత్వం క్రీడాకారులకు ఉపయోగపడేలా తీర్చిదిద్దింది. దీనిని బుధవారం మంత్రి రాంప్రసాదరెడ్డి ప్రారంభించనున్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఇదే సముదాయంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదు. కూటమి అధికారంలోకి రావడం.. శాప్ చైర్మన్‌గా ఎ.రవినాయుడు నియమితులయ్యారు. తొలిప్రాధాన్యంగా ఆయన శ్రీనివాస క్రీడా సముదాయంపై దృష్టిపెట్టారు. మూడు నెలల్లో ఆధునికీకరణ పనులు పూర్తి చేయించారు. బుధవారం జరిగే ప్రారంభోత్సవానికి సంబంధించి మంగళవారం అధికారులతో సమీక్షించారు. కాగా, ఆధునికీకరణ పనుల్లో భాగంగా.. రూ.55లక్షలతో సిమ్మింగ్‌పూల్‌ను అభివృద్ధి చేశారు. పాచిపట్టిన భవనాన్ని రూ. 28 లక్షలతో పునర్నిర్మించి ఎన్టీఆర్ క్రీడా వికాసకేంద్రంగా మార్చారు. అందులోనూ రూ.25 లక్షలతో రైఫిల్ షూటింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అర్ధంతరంగా ఆగిన మల్టీపర్పస్ స్పోర్ట్స్ ఎరీన కేంద్రాన్ని రూ.1.37 కోట్ల స్మార్ట్ సిటీ నిధులతో పికిల్‌బాల్, వాలీబాల్, బాస్కెట్ బాల్ క్రీడాంశాల వేదికగా రూపొందించారు. రూ.29లక్షలతో లైట్లు మార్చారు. మరుగుదొడ్లను మరమ్మతులు చేయించారు. దాతల సహాయంతో మేజర్ ధ్యాన్‌చంద్ విగ్రహాన్ని ఏర్పాటుచేయించారు. జిల్లా నుంచి జాతీయ స్థాయి వరకు పోటీలు నిర్వహించేలా తీర్చిదిద్దారు.

క్రిస్ సిటీ ఇకపై ఇండస్ట్రియల్ కారిడార్

● చిల్లకూరు, కోట మండలాల్లోని 10,834 ఎకరాల్లో ఏర్పాటు ● గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

తిరుపతి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): క్రిస్ సిటీ ఇకనుంచీ ఇండస్ట్రియల్ కారిడార్ హోదా సంతరించుకోనుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం అసాధారణ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. చెన్నై-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగమైన కృష్ణపట్నం నోడ్ (క్రిస్ సిటీ) చిల్లకూరు, కోట మండలాల పరిధిలో ఏర్పాటు కానున్న సంగతి తెలిసిందే. రూ.37,500 కోట్ల పెట్టుబడులను ఆకర్షించేలా, 4,67,500 మందికి ఉద్యోగాలు కల్పించేలా ఈ నోడ్‌కు కేంద్ర ప్రభుత్వం గతంలోనే అనుమతులిచ్చింది. తొలి దశలో రూ.1518.44 కోట్లతో మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్ర ప్రభుత్వం అనుమతించింది. ఇటీవల ప్రధాని మోదీ విశాఖ నుంచీ వర్చువల్‌గా కృష్ణపట్నం నోడ్‌కు శంకుస్థాపన చేశారు. ఆ క్రమంలో సీబీఐసీ కృష్ణపట్నం నోడ్‌ను ఏపీ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ యాక్ట్ 2017 కింద ఇండస్ట్రియల్ నోడ్‌గా రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించింది. కృష్ణపట్నం నోడ్ పూర్తిగా తిరుపతి జిల్లా పరిధిలో ఏర్పాటు కానుంది. చిల్లకూరు మండలం తమ్మినపట్నంలో 1131 ఎకరాలు, బల్లవోలులో 2009 ఎకరాలు, వెల్లపాలెంలో 1885 ఎకరాలు, మోమిడిలో 285 ఎకరాలు, తూర్పు కణుపూరులో 400 ఎకరాలు, కోట మండలం కర్లపూడిలో 1032 ఎకరాలు, కొత్తపట్నంలో 3651 ఎకరాలు, సిద్ధవరంలో 439 ఎకరాలు చొప్పున మొత్తం 10,834 ఎకరాలను రాష్ట్ర ప్రభుత్వం ఈ ఇండస్ట్రియల్ నోడ్ కోసం కేటాయించింది. దీంతో ఈ రెండు మండలాల్లోని ఎనిమిది గ్రామాలకు చెందిన 10,834 ఎకరాలను ఇండస్ట్రియల్ కారిడార్‌గా ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా అసాధారణ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో క్రిస్ సిటీగా పరిగణనలో ఉన్న ఈ ఇండస్ట్రియల్ కారిడార్‌లో ఇకనుంచీ మౌలిక సదుపాయాలకు సంబంధించిన పనులు మొదలు కానున్నాయి.

ప్రజా రవాణాధికారిగా వెంకటరావు



తిరుపతి(ఆర్టీసీ), ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజారవాణాధికారిగా కె.వెంకటరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఏపీఎస్ ఆర్టీసీ ప్రధాన కార్యాలయం ఉత్తర్వులు జారీచేసింది. ఈయన ప్రకాశం జిల్లా డీపీటీవోగా పనిచేస్తున్నారు. ప్రస్తుతమున్న నరసింహులు ఈనెల 30న పదవీ విరమణ చేయనున్నారు. ఇదేరోజు వెంకటరావు బాధ్యతలు స్వీకరించనున్నారు.

మే 6 నుంచి పద్మావతి పరిణయోత్సవాలు

తిరుమల, ఏప్రిల్22(ఆంధ్రజ్యోతి): తిరుమలలో పద్మావతి శ్రీనివాసుల పరిణయోత్సవాలు మే 6 నుంచి 8వ తేదీ వరకు వైభవంగా జరుగనున్నాయి. నారాయణగిరి ఉద్యానవనంలోని పరిణయోత్సవ మండపంలో ఈ వేడుకలను నిర్వహించనున్నారు. తొలిరోజు మలయప్పస్వామి గజవాహనం, రెండవరోజు అశ్వవాహనం, మూడోరోజు గరుడవాహనంపై వేంచేపు చేస్తారు. మరోవైపు ఉభయ నాంచారులను ప్రత్యేక పల్లకీలో పరిణయోత్సవ మండపానికి వేంచేపు చేస్తారు. తర్వాత కనులపండువగా కల్యాణమహోత్సవాన్ని నిర్వహిస్తారు. ఉత్సవం నేపథ్యంలో మూడురోజుల పాటు ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకారసేవలను టీటీడీ రద్దు చేసింది.

నాయుడుపేట సెజ్‌లో సోలార్ పవర్ ప్లాంట్

రూ.4200 కోట్ల పెట్టుబడి.. 1500 మందికి ఉపాధి

తిరుపతి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట ఎంపీ సెజ్‌లో రూ.4200 కోట్ల పెట్టుబడితో సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు కానుంది. 8 గిగా వాట్స్ సోలార్ పవర్ పీవీ సెల్ మానుఫ్యాక్చరింగ్ ప్లాంట్ ఏర్పాటుకు మెస్సర్స్ ప్రీమియర్ ఎనర్జీస్ సంస్థ ముందుకొచ్చింది.ఈ సంస్థకు పలు రాయితీలు, మినహాయింపులను ఇస్తూ ప్రభుత్వం రాష్ట్ర పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.యువరాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. సెజ్‌లో ఎకరా రూ.60 లక్షల చొప్పున 106.6 ఎకరాలను కేటాయించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. పదేళ్ల వ్యవధిలో రూ.635 కోట్లకు మించకుండా ప్లాంట్, యంత్రాలు.. రూ.345 కోట్లకు మించకుండా యుటిలిటీస్‌పై పెట్టుబడి వ్యయంలో 30 శాతం రాయితీకి.. ఏడాదికి రూ.45.99 కోట్ల చొప్పున విద్యుత్ ఛార్జీలలో పదేళ్ల పాటు రాయితీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రోజుకు 7.7 మిలియన్ లీటర్ల చొప్పున పదేళ్ల పాటు ఉచితంగా నీటి సరఫరాకు అంగీకరించింది. ఈ మొత్తం 127.75 కోట్లు మించకూడదని షరతు విధించింది. భూముల రిజిస్ట్రేషన్‌కు రూ.4.80 కోట్ల స్టాంప్ డ్యూటీ మినహాయింపునకు సంసిద్ధత వ్యక్తం చేసింది.

పోర్ట్‌బ్లెయిర్ మున్సిపల్ చైర్మన్ పీఠం టీడీపీదే



కౌన్సిలర్లతో మాధవ నాయుడు, అండమాన్ నికోబార్ దీవుల టీడీపీ అధ్యక్షుడు మాణిక్యరావ్ యాదవ్ తదితరులు

దక్కిలి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): అండమాన్‌లోని (శ్రీవిజయపురం) పోర్ట్‌బ్లెయిర్ మున్సిపల్ చైర్మన్ స్థానాన్ని టీడీపీ కైవసం చేసుకుంటుందని ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు, అండమాన్ నికోబార్ దీవుల ఇన్‌చార్జి వెంపటి మాధవ నాయుడు తెలిపారు. మంగళవారం ఆయన ఫోన్‌లో మీడియాతో మాట్లాడుతూ ఈనెల 24న పోర్ట్‌బ్లెయిర్ మున్సిపల్ చైర్మన్ ఎన్నిక జరుగుతుందన్నారు. మొత్తం 24 మంది కౌన్సిలర్లు ఉండగా, బీజేపీకి 10, టీడీపీకి 2, స్వతంత్ర అభ్యర్థి 1, కాంగ్రెస్‌కు 10, డీఎంకే పార్టీకి 1 కౌన్సిలరు ఉన్నారని పేర్కొన్నారు. బీజేపీ, స్వతంత్ర అభ్యర్థుల మద్దతుతో టీడీపీ అభ్యర్థి సాహుల్ అహ్మద్ చైర్మన్‌గా ఎన్నికవడం తథ్యమన్నారు.

సంస్థాగత ఎన్నికలకు సిద్ధం కండి



సమావేశంలో మాట్లాడుతున్న కోటేశ్వరరెడ్డి

దక్కిలి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న టీడీపీ సంస్థాగత ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు, బూత్‌కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. త్వరలో నిర్వహించనున్న సంస్థాగత ఎన్నికల్లో గ్రామ, బూత్ కమిటీలతో పాటు మండల కమిటీలను ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. సమావేశంలో దక్కిలి పట్టణ అధ్యక్షుడు చంద్రారెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు గడ్డం చంద్రశేఖరరెడ్డి, మోపూరు సొసైటీ అధ్యక్షుడు పులి జనార్దనరెడ్డి, పీపీ చౌదరి, రమేష్ నాయుడు, రంగినేని రాజా, వెంకటేశ్వర్లు నాయుడు, దందవోలు పెంచలరెడ్డి, దక్కిలి సునీల్‌రెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



క్రీడల్లో ప్రతిభచాటిన విద్యార్థులను సన్మానించిన రోటరీక్లబ్ సభ్యులు

గూడూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించాలని రోటరీక్లబ్ సభ్యులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, శ్రీకంటి రామమోహన్‌రావు అన్నారు. మంగళవారం స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ధరిత్రీ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో ప్రతిభచాటిన విద్యార్థులను సన్మానించి, వారికి ప్రోత్సాహక నగదు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల వల్ల ఆరోగ్యంగా ఉంటామన్నారు. మానసిక ఒత్తిడిని అధిగమించి ఉల్లాసంగా ఉండేందుకు క్రీడలు దోహదపడుతాయన్నారు. విద్యార్థులు ఏదో ఒక క్రీడలో ప్రతిభ చాటాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో సనత్‌కుమార్, జడ్పీ బాలికల, బాలుర ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు మాధవీలక్ష్మి, భారతి, పీడీలు విజయలక్ష్మి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిత



కార్యక్రమంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు

గూడూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): చదువు ద్వారానే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో మంగళవారం ఒలంపియాడ్ పరీక్షల్లో ప్రతిభచాటిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే చదువులపై శ్రద్ధ చూపాలన్నారు. క్రమశిక్షణతో మెలుగుతూ ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. ఒలంపియాడ్ పరీక్షల్లో ప్రతిభ చాటిన శ్రేష్టరెడ్డికి ప్రథమ బహుమతిగా లాప్‌టాప్, తుదిశ్రీ, నంద కిషోర్‌రెడ్డికి ద్వితీయ బహుమతిగా ట్యాబ్‌లను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, శ్రీకాంత్, శ్రీహరిబాబు, హరిబ్రహ్మ, మల్లి, సాయి చందన, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

రాడార్ ఇంజనీరింగ్‌లో శిక్షణ

కోట, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు అడ్వాన్స్‌డ్ డ్రైవ్ అసిస్టెంట్ సిస్టమ్ ఏ ప్రాక్టికల్ వర్క్‌షాప్ ఆన్ రాడార్‌పై శిక్షణ కార్యక్రమం జరిగింది. కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయ్ కుమార్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సూరత్‌కల్‌లోని ఎన్‌ఐటీ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీహరి, షాషా, వందన ముఖ్య అతిథులుగా విచ్చేసి రాడార్ ఇంజనీరింగ్, అనువర్తనాలపై ప్రయోగాత్మక శిక్షణ ఇచ్చారు. డ్రైవర్ లెస్ వెహికల్ నియంత్రణ చేసే విధనాన్ని ప్రయోగాత్మకంగా విద్యార్థులకు వివరించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి ప్రయోగాత్మక శిక్షణ తరగతుల వల్ల భవిష్యత్తులో కోర్ జాబ్స్ తెచ్చుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ రామకృష్ణప్రసాద్, లావణ్య, హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

కలప అక్రమ రవాణాపై చర్యలు తీసుకోండి

గూడూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విందూరు చెరువులో తుమ్మచెట్లను కొంతమంది అక్రమంగా నరికి కలపను తరలిస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. చెరువులో పెరుగుతున్న తుమ్మచెట్లకు వేలం నిర్వహించకుండా అక్రమంగా నరికి తరలిస్తు న్నారని, అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ముగిసిన పోషణ్ పక్వాడ వారోత్సవాలు

వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కుమ్మరిగుంట, పోలీస్ స్టేషన్, తూర్పువీధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్వాడ వారోత్సవాలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా సీడీపీవో షంషాద్ బేగం మాట్లాడుతూ వెయ్యి రోజుల సంరక్షణ కోసం గర్భం ధరించినప్పటి నుంచి జాగ్రత్తలు పాటించాలన్నారు.

కోట: మండల పరిధిలోని జరుగుమల్లి అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ్ పక్వాడ కార్యక్రమం జరిగింది. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృష్ణమ్మ ఆధ్వర్యంలో గర్భిణులు, తల్లులకు మొదటి వెయ్యి రోజులు సంరక్షణ, పిల్లల పోషణపై అవగాహన కల్పించారు. అదేవిధంగా పోషకాహారాన్ని తయారు చేసే విధానాన్ని ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు విజయలక్ష్మి, మీరమ్మ, స్వాతి, తల్లులు, గర్భిణులు పాల్గొన్నారు.

పెళ్లకూరు: మండలంలోని దిగువ చావాలిలో పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించారు. సీడీపీవో ఉమామహేశ్వరి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు ఆకుకూరలు, కూరగాయలు, పాలు, గుడ్లతో పాటు తృణ ధాన్యాలు తీసుకోవాలన్నారు.

మద్యం సీసాల స్వాధీనం

బాలాయపల్లి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి) మండలంలోని వెంకటరెడ్డి పల్లిలో టిఫిన్ దుకాణంలో ఎనిమిది మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ శివశంకర్ పట్టుకున్నారు. దుకాణం నిర్వాహకుడు కిరిటీపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మట్కా కేసులో 8 మంది అరెస్టు

వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బొమిడి కాలవ వద్ద మట్కా(సింగిల్ డిజిట్) ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ సుబ్బారావు మంగళవారం తెలిపారు. పట్టణానికి చెందిన బీడా ధర్మయ్య, శివశంకర్, కాలేషా, మహ్మద్ అలీ, రాజేంద్ర, వీర రాఘవులు, హేమంత్, వెంకటేష్‌ను అరెస్టు చేసి, వారి వద్ద రూ.54,400 స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను బుధవారం కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు.

బెల్టు షాపు నిర్వాహకుడి అరెస్టు

వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 8వ వార్డు పెరియవరం అరుంధతివాడలో బెల్టు షాపు నిర్వహిస్తున్న వీర రాఘవులును అరెస్టు చేశామని ఎస్‌ఐ సుబ్బారావు తెలిపారు. అతని వద్ద నుంచి 10 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.



రాణీపేటలో చెత్త చెదారాలతో నిండిపోయిన డ్రైనేజీ - కాలువలోనే తాగునీటి పైపు

డ్రైనేజీ ఇలా.. మురుగు పారేదెలా..?

వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాణీపేట ప్రధాన రహదారిలో డ్రైనేజీ పూర్తిగా చెత్తచెదారాలతో నిండిపోయింది. ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు, ఇతర వ్యర్థాలు చేరడంతో మురుగునీరు పారడానికి వీలు లేకుండా మూసుకుపోయింది. అంతేకాకుండా పట్టణంలోని టీచర్స్ కాలనీ, రాణీపేట, మందరిల్లు, తోలిమిట్ట ప్రాంతాల్లో తాగునీటి పైపులు డ్రైనేజీ కాలవల్లోనే ఉండడంతో మంచినాణ్యతపై పట్టణ ప్రజలు ఆందోళన చేస్తున్నారు. పైపుల మరమ్మతులు, లీకేజీ సమయంలో కలుషి నీరు వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తోలిమిట్ట దారిలో చెత్తకుప్ప వద్ద గత వారం రోజులుగా డ్రైనేజీ పైపు లీకేజీ అయి నీరు వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి డ్రైనేజీ కాలువల్లో పూడిక తీయడంతో పాటు తాగునీటి పైపు లైన్లను బాగుచేయాలని ప్రజలు కోరుతున్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న కారు: ముగ్గురికి గాయాలు



బోల్తా పడిన ట్రాక్టర్ - నుజ్జునుజ్జు అయిన కారు - ప్రమాదంలో గాయపడిన కృష్ణచంద్

దొరవారిసత్రం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం టపాయిండ్లు వద్ద జాతీయ రహదారిపై మంగళవారం కారు ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న విజయవాడకు చెందిన కృష్ణచంద్ తీవ్రంగా గాయపడ్డారు. ఆయన భార్య పల్లవికి స్వల్ప గాయాలయ్యాయి. ట్రాక్టర్ డ్రైవర్ గురవయ్య కూడా తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేశారు. మెరుగైన వైద్యం కోసం కృష్ణచంద్‌ను చెన్నైకు తీసుకెళ్లగా ట్రాక్టర్ డ్రైవర్ గురవయ్యను నెల్లూరుకు తరలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ అజయ్‌కుమార్ రోడ్డుపై ఉన్న వాహనాలను పక్కకు తొలగించి వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

డంపింగ్ యార్డులో చెత్తంతా రోడ్డు పైకి



సూళ్లూరుపేట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణాన్ని డంపింగ్ యార్డు సమస్య వెంటాడుతూనే ఉంది. హోలీక్రాస్ కూడలి సమీపంలో జాతీయ రహదారి పక్కన ఉన్న డపింగ్ యార్డులో వారం రోజుల క్రితం మంటలు చెలరేగడంతో నాలుగు రోజుల పాటు పొగతో పట్టణవాసులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసినా పూర్తిగా తగ్గలేదు. ఇప్పటికీ డంపింగ్ యార్డు నుంచి తేలికపాటి మంటలు, పొగ వస్తూనే ఉంది. ఇదిలా ఉండగా మున్సిపాలిటీలో ప్రతిరోజూ ఉత్పత్తి అయ్యే చెత్త డంపింగ్ యార్డు ముందుభాగంలో పోయడంతో జాతీయ రహదారి పైకి చేరింది. ఇటు పొగతో పాటు రోడ్డుపై చేరిన చెత్త, దుర్వాసనతో వాహనచోదకులకు ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు చొరవచూపి డంపింగ్ యార్డును పట్టణానికి దూరంగా మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

సర్వీసు రోడ్డు నిర్మించండి



ఎన్‌హెచ్ పీడీ చౌదరికి వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటకృష్ణా రెడ్డి, రైతులు

నాయుడుపేట, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - తూర్పు కనుపూరు నడుమ సాగరమాల రహదారికి ఇరువైపులా సర్వీసు రోడ్డు నిర్మించాలని కోరుతూ మున్సిపల్ వైస్ చైర్మన్ జలదంకి వెంకట కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో రైతులు నెల్లూరు ఎన్‌హెచ్ పీడీ చౌదరికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకట కృష్ణారెడ్డి మాట్లాడుతూ సాగరమాల భూసేకరణ సమయంలో ఆర్డీవో, తహసీల్దార్లు గ్రామాల వద్ద సర్వీసు రోడ్లు, అండర్ పాసులు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ప్రస్తుతం గ్రామాల వద్ద సర్వీసు రోడ్లు, అండర్ పాసులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడతున్నారన్నారు. కార్యక్రమంలో సన్నారెడ్డి హరినాథరెడ్డి, వాకాటి సుధాకర్ రెడ్డి, జలదంకి మదన్‌మోహన్‌రెడ్డి, తంబిరెడ్డి సురేష్ రెడ్డి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో వంటగది ప్రారంభం



వంటగదిని ప్రారంభిస్తున్న రోటరీ అధ్యక్షుడు జయరాజగోపాల్, కార్యదర్శి రామ్మోహన్, పక్కన ఉపాధ్యాయులు

నాయుడుపేట, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో రూ.1.50 లక్షలతో నిర్మించిన భోజనశాల, వంటగదిని మంగళవారం రోటరీక్లబ్ అధ్యక్షుడు పసల జయ రాజగోపాల్ ప్రారంభించారు. భోజనశాలకు యూఎస్‌ఏకి చెందిన బెస్ట్ రన్నర్స్ అసోసియేషన్ సహకారంతో తాగునీరు వసతి కల్పించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ కార్యదర్శి రామ్మోహన్, విశ్రాంతి మునగాల కృష్ణారావు, ప్రధానోపాధ్యాయుడు సురేష్‌బాబు, ఉపాధ్యాయులు కందనూరు సంజయ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రింటర్ వితరణ



ప్రింటర్ అందజేస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

గూడూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక రెండోపట్టణ పరిధిలోని జీఎస్‌ఆర్ మున్సిపల్ హైస్కూల్‌కు మంగళవారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ప్రింటర్ అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో వసతులను మెరుగు పరిచేందుకు తమ క్లబ్ ఆధ్వర్యంలో కృషి చేస్తున్నామన్నారు. దాతల దాతృత్వాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని చదువుల్లో రాణించాలన్నారు. ఇదే పాఠశాల పూర్వ విద్యార్థులైన రోటరీక్లబ్ సభ్యులు బాలకృష్ణమరాజు, సుబ్రహ్మణ్యం, మల్లికార్జున్, మహిధర్‌రెడ్డి సహకారంతో ప్రింటర్ అందజేశామన్నారు. కార్యక్రమంలో దశరధ రామిరెడ్డి, మల్లు విజయ్‌కుమార్‌రెడ్డి, ఎస్‌వీ రత్నం, రాంప్రసాద్, సురేష్‌రెడ్డి, మృదుల తదితరులు పాల్గొన్నారు.

భజన గురువులకు సన్మానం

గూడూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక గాంధీనగర్‌లో మంగళవారం ప్రాచీన జానపద కళానిలయం వ్యవస్థాపకుడు, పండరి భజన గురువు కృష్ణదాస్ ఆధ్వర్యంలో భజన గురువులను మహానందయ్య, సుబ్బరాయుడు, రామాంజనేయును సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఈనాటికీ మానవ సంబంధాలు బతికే ఉన్నాయంటే అందుకు కారణం అలనాటి జానపద కళలే కారణమన్నారు. జానపద కళలు మన సంస్కృతికి నిదర్శనంగా నిలుస్తాయన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెళ్లకూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డిపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్ల మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జీలపాటూరు, చిల్లకూరు, చావాలి, టెంకాయతోపు, పెళ్లకూరు, కొత్తూరు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆశాఖ ఏఈ సురేష్‌బాబు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఏపీఎన్‌జీవో కార్యవర్గ సభ్యుల ఎన్నిక



సభ్యులను సన్మానిస్తున్న ఏపీఎన్‌జీవో అసోసియేషన్ నాయకులు

గూడూరు అర్బన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏపీఎన్‌జీవో కార్యాలయంలో మంగళవారం గూడూరు తాలూకా కార్యవర్గ సభ్యుల ఎన్నిక జరిగింది. ఉపాధ్యక్షుడిగా సతీష్ జాయింట్ సెక్రటరీలుగా సుబ్రహ్మణ్యం, రేణుకమ్మను ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఎన్నికల అధికారిగా పెంచలయ్య వ్యవహించారు. నూనతంగా ఎన్నికైన సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో శ్రావణ్‌కుమార్, తనూజ్ కుమార్, నాగరాజ్‌కుమార్, శంకరరాజు, రవికుమార్ పాల్గొన్నారు.

విద్యతోనే పేదరిక నిర్మూలన



విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న డీవైఈవో సనత్‌కుమార్

చిల్లకూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే పేదరికం నిర్మూలన జరుగుతుందని డిప్యూటీ ఈవో సనత్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని పారిచెర్లవారిపాళెం జడ్పీ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచి బలోపేతం చేయాలన్నారు. వార్షికోత్సవ కార్యక్రమాల వల్ల విద్యార్థులలో దాగి ఉన్న కళలను వెలికి తీయవచ్చన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో రవూఫ్, హెచ్‌ఎం చంద్రశేఖర్, మాధవయ్య, చంద్ర, మంజుశ్రీ, సంధ్యారాణి, శ్రీనివాసులు, లీల, కామేశ్వరి, ఆదిలక్ష్మి, నాగభూషణమ్మ, సుగుణ, సురేంద్ర కుమార్, మస్తాన్, షకీలా తదితరులు పాల్గొన్నారు.

'పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం'

కోట, ఏప్రిల్ 22: పర్యావరణాన్ని పరిరక్షించుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏఆర్‌డీ సంస్థ చైర్మన్ బషీర్ కోరారు. కోటలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ప్రపంచ ధరిత్రీ దినోత్సవం నిర్వహిం చారు. మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో బషీర్‌తో పాటు టీడీపీ నాయకులు మొక్కలు నాటి, వాటిని దత్తత తీసుకు న్నారు. ఈ సందర్భంగా పలువురు టీడీపీ నాయ కులు మాట్లాడుతూ పర్యా వరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి దత్తత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయ కులు నల్లప్పరెడ్డి జగన్ మోహన్‌రెడ్డి, జలీల్ అహ్మద్, మోహన్‌రెడ్డి, తీగల సురేష్ బాబు, భాస్కర్‌రెడ్డి, శ్యామ సుందరరెడ్డి, దారా సురేష్, మధు యాదవ్, కోటారెడ్డి తదిత రులు పాల్గొన్నారు.

అరటికాయల అలంకరణలో తాతయ్యగుంట గంగమ్మ

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): తిరుపతి తాతయ్య గుంట గంగమ్మ జాతర ముందు రెండో మంగళవారం గంగమ్మ విశేషాలంకరణలో దర్శనం ఇచ్చింది. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. తర్వాత అరటిపండ్లతో గంగమ్మను అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయం వద్ద మహిళలు, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అంబళ్లు పోసి మొక్కులు తీర్చుకున్నారు.



అభివృద్ధికి సహకరించండి



రైతులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్

కోట, ఏప్రిల్ 22: చెన్నై - బెంగళూరు కోస్టల్ కారిడార్ అభివృద్ధికి రైతులు పూర్తి సహకారం అందించాలని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ కోరారు. మండల పరిధిలోని శ్రీనివాససత్రం, కొత్తపట్నం, యమదిన్నెపాళెం, గున్నంపడియ గ్రామాల్లో మంగళవారం జేసీ పర్యటించి రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. రోడ్డు పనులు జరుగుతున్న నేపథ్యంలో సాగులో ఉన్న వేరుశనగ పంటలకు సంబంధించి రైతులతో చర్చించారు. రోడ్డు పనుల్లో భూములు కోల్పోయే ప్రతి రైతునూ అన్ని విధాల ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జయజయరావు, సర్వేయర్ గోపిరెడ్డి, వీఆర్‌వో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పట్టాలివ్వండి

గూడూరు అర్బన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలం లోని కాంద్ర గ్రామంలో ఎస్సీ, ఎస్టీలు ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు మంజూరు చేయాలని సీపీఎం నాయకులు శివకుమార్, బీవీ రమణయ్య మంగళవారం కోరారు. ఎన్నో ఏళ్లుగా పేదలు భూములు సాగు చేసుకుని జీవనోపాధి పొందు తున్నారని, అధికారులు స్పందించి భూములను పట్టాలను అందజేయాలని కోరారు.

దుస్తుల పంపిణీ

చిల్లకూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలం లోని దిగువరాజుపాళెం గిరి జన కాలనీవాసులకు మంగళ వారం పీపుల్ వెల్ఫేర్ అండ్ చైల్డ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేశారు. ట్రస్ట్ ఫౌండర్ మల్లికార్జున్ మాట్లాడుతూ విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. కాలనీలోని పిల్లలంతా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాల న్నారు. కార్యక్రమంలో అరుణ్ బాబు, స్థానికులు పాల్గొన్నారు.

టూరిస్టు బస్సు ఢీకొని కారు ధ్వంసం
ఒకరికి గాయాలు

తిరుపతి(నేరవిభాగం) ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): తమిళనాడుకు చెందిన ప్రైవేటు టూరిస్టు బస్సు కారు ఢీకొన్న ఘటన మంగళవారం తిరుపతి-రేణిగుంట రోడ్డులోని కాటన్‌మిల్లు వద్ద చోటు చేసుకుంది. అలిపిరి ఎస్‌ఐ లోకేష్‌బాబు కథనం మేరకు.. శెట్టిపల్లికి చెందిన రైల్వే విశ్రాంత ఉద్యోగి పుష్పరాజ్ తిరుపతి నుంచి శెట్టిపల్లి వైపు కారులో వెళుతున్నాడు. అదే సమయంలో తమిళనాడుకు చెందిన ప్రైవేటు టూరిస్టు బస్సు ముందు వెళుతోంది. అకస్మాత్తుగా బస్సు డ్రైవర్ బ్రేక్ వేయడంతో కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. పుష్పరాజ్‌కు స్వల్పగాయాలయ్యాయి. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రుణదాతల ఒత్తిళ్లు భరించలేక కారు డ్రైవర్ పరారీ

తిరుపతి(నేరవిభాగం) ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): తిరుపతి పరిధిలో ఒక కారు డ్రైవర్ అప్పులవారి ఒత్తిళ్లు భరించలేక ఇంటినుంచి వెళ్లిపోయాడు. డ్రైవర్ భార్య శ్రీలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. తిరుపతి ఎస్వీయూనివర్శిటీ పరిధిలోని ఉల్లిపట్టెడలో కాపురమున్న రవి పలువురి వద్ద అప్పులు చేశాడు. అప్పు ఇచ్చినవారి నుంచి ఒత్తిళ్లు ఎక్కువయ్యాయి. దీంతో ఇంటినుంచి వెళ్లిపోయాడు. భార్య ఫిర్యాదు మేరకు సీఐ రామయ్య కేసు నమోదు చేశారు.

వైభవంగా 4వ సప్తగిరుల ప్రదక్షిణ

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): 4వ తిరుమల సప్తగిరుల ప్రదక్షిణ యాత్రను మంగళవారం నిర్వహించారు. తిరుపతి అలిపిరి సమీపంలోని భారతీయ విద్యాభవన్ మైదానంలో ఎంపీ, కేంద్ర పార్లమెంటరీ ఎస్సీ, ఎస్టీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ ఫగ్గన్ సింగ్ కులస్తే ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. తిరుమల ఏడు కొండలు చుట్టేస్తూ వాహనంలో తిరుపతి, భాకరాపేట, రాయచోటి, రాజంపేట మీదుగా ప్రదక్షిణ పూర్తి చేసి రాత్రి కపిలతీర్థం వద్ద యాత్రను ముగించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు భానుప్రకాష్ రెడ్డి, ఐఎంఏ జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ శ్రీహరిరావు, బీజేపీ జిల్లా సాంస్కృతిక మండలి అధ్యక్షులు గుండాల గోపీనాథ్ రెడ్డి, మంత్రపీఠ పీఠాధిపతి స్వామి నరసింహ సింహయాజులు, నిర్వాహకులు ఆదినారాయణ, సచ్చిదానంద, హనుమంత నాయక్, స్వామీజీలు, భక్తులు పాల్గొన్నారు.



సప్తగిరుల ప్రదక్షిణను జెండా ఊపి ప్రారంభిస్తున్న ప్రముఖులు

భూముల రీ సర్వేకు సహకరించండి



సమావేశంలో ప్రసంగిస్తున్న అరుణ్‌కుమార్

శ్రీసిటీ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దాసుకుప్పం రెవెన్యూ పరిధిలో భూముల రీ సర్వేకు గ్రామస్తులు సహకరించాలని జిల్లా సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ అరుణ్ కుమార్ కోరారు. మంగళవారం దాసుకుప్పం సచివాలయ ఆవరణలో భూముల రీసర్వేపై ఇన్‌చార్జి తహసీల్దార్ రాజశేఖర్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అరుణ్ కుమార్ మాట్లాడుతూ... రీ సర్వే ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నామన్నారు. రెవెన్యూ పరిధిలోని 280 ఎకరాలను రీ సర్వే చేస్తామన్నారు. భూముల, ఖజ్ర స్థలాల రికార్డు లను అనుసరించి సర్వే జరుగుతుందన్నారు. ఎక్కడైనా విస్తీర్ణంలో తేడాలు వచ్చినా రెవెన్యూ రికార్డుల ప్రకారం పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించి హద్దులు నిర్ణయిస్తామన్నారు.భూముల విస్తీర్ణం నమోదు చేయడంతో పాటు హద్దురాళ్లు నాటుతామన్నారు. డీఐఎస్ ప్రసాదరావు, ఆర్ఐ సురేష్, వీఆర్వో శేఖర్, మండల సర్వేయర్ చంద్రశేఖర్, నాయకులు సుందరరామి రెడ్డి, లోకయ్యరెడ్డి, జగన్నాథరెడ్డి పాల్గొన్నారు.

ప్రతి గ్రామానికీ సిమెంట్ రోడ్డు: ఆదిమూలం


సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి సిమెంట్ రోడ్లు నిర్మిస్తామని ఎమ్మెల్యే ఆదిమూలం చెప్పారు. మండలంలోని కారణి మిట్టలో రూ.22 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్లను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... పీ4 ద్వారా పేదరికాన్ని నిర్మూలిస్తామన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. సర్పంచు పద్మమ్మ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కన్నయ్యనాయుడు, మాజీ ఎంపీపీ బీరమేదూయన్, మునిచంద్ర నాయుడు, కార్తీకనాయుడు, రవినాయుడు, బీజేపీ మండల అధ్యక్షుడు హరిబాబురెడ్డి, జనసేన మండల అధ్యక్షుడు బాషా, తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీవో త్రివిక్రమ్‌రావు, శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి, ఎస్ఐ విశ్వనాథనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ సీడ్స్‌లో తనిఖీలు


సుబ్బారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏపీ సీడ్స్‌ను మంగళవారం విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ మన్నే సుబ్బారెడ్డి తనిఖీ చేశారు. అంతకు ముందు ఆయన శ్రీకాళహస్తీశ్వర స్వామిని దర్శించుకున్నారు. సంస్థ స్థితిగతులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీ సీనియర్ నాయకుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రంగినేని చెంచయ్యనాయుడు, బీజేపీ నాయకుడు మేళాగారం సుబ్రహ్మణ్యంరెడ్డి ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. అనంతరం కార్మికులకు ఎక్కువ పనిదినాలు కల్పించి సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. అదే విధంగా రైతులకు సకాలంలో నాణ్యమైన విత్తనాలు అందించాలని కోరారు. సంస్థ అభివృద్ధితో రైతులను భాగస్వామ్యం చేయాలన్నారు. అనంతరం కార్మిక సంఘ నాయకులు ఈశ్వర్‌రెడ్డి, వి.మునెయ్య, గురవయ్య, మోహన్ కలిసి సంస్థ అభివృద్ధికి వినతిపత్రం అందజేశారు.

పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించండి


పిల్లలకు దిశానిర్దేశం చేస్తున్న డీఈవో కుమార్

కేవీబీపురం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండలంలో విద్యార్థులను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించేలా ఉపాధ్యాయులు, అధికారులు చొరవ తీసుకోవాలని డీఈవో కె.వి.ఎన్ కుమార్ చెప్పారు. మంగళవారం మండలంలోని రాగిగుంట జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంఈవోలు లక్ష్మీపతి, రవికుమార్ ఆధ్వర్యంలో జరిగిన విద్యార్థుల నమోదు సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య, విజ్ఞానం అందుతాయన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువు పూర్తయిన వెంటనే ఆ విద్యార్థులను ప్రాథమిక పాఠశాలల్లో, ప్రాథమిక పాఠశాలల్లో 5వ తరగతి పూర్తయిన వెంటనే 6వ తరగతికి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేర్పించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న వసతులపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మునిరత్నంరెడ్డి, ఎంపీడీవో రాధారాణి, ఏఎంవో శివశంకరయ్య, అన్ని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు మోహన్‌రెడ్డి, సుకన్య, ఐసీడీఎస్ సీడీపీవో శోభారాణి, సూపర్‌వైజర్లు సుమతి, కల్పలత, అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.

త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డికి ఘనస్వాగతం

బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపురంలో ఉన్న విద్యుకుడి ఐసీపీటి విద్వేసిన త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డికి ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, బీజేపీ, జనసేన నాయకులు మనస్ఫూర్తిగా పలికారు. శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి, సీఐ తిమ్మయ్య, ఎస్ఐ విశ్వనాథనాయుడు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.

పుత్తూరు వార్తలు

కమనీయం... కమలనాథుడి కల్యాణం



వడమాలపేట,22 ఏప్రిల్(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పలాయగుంట లో కొలువై ఉన్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉభయ దేవేరులతో కమలనాథుడి కల్యాణం కమనీయంగా నిర్వహించారు. మంగళవారం పద్మావతి, ఆండాళ్ సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామిని పట్టు పీతాంబరాలతో వధూవరులుగా కల్యాణ పీఠాన్ని అధిరోహింప జేశారు. ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు ఆధ్వర్యంలో వేదమంత్రాలు, భక్తుల గోవిందనామ స్మరణల నడుమ ఉభయ నాంచారులకు మాంగళ్య ధారణ చేయించారు. తలంబ్రాలు పోయించారు. పరిసరాల నుంచి భక్తులు విశేషంగా తరలి వచ్చి కల్యాణోత్సవాన్ని తిలకించి తన్మయత్వం చెందారు.

పరిశోధనలతో విజ్ఞానం


ప్రతిభ కనబరచిన విద్యార్థులతో కళాశాల అధ్యాపకులు, నిర్వాహకులు

పుత్తూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు రీసెర్చ్ ప్రాజెక్టులలో పాల్గొని మండుల వినియోగంపై మరింత విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని తిరుపతిలోని హోమియో రీసెర్చ్ సెంటర్ సైంటిస్ట్ డాక్టర్ రవిచంద్రారెడ్డి సూచించారు. పట్టణంలోని కేకేసీ హోమియో మెడికల్ కళాశాలలో మంగళవారం ప్రపంచ హోమియో దినోత్సవంతో పాటు ప్రెషర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోమియో మందుల వినియోగంలో దుష్ప్రభావాలు లేవని రోగులు గుర్తించి క్రమంగా ఈ వైద్య విధానంలోకి ఆకర్షితులవుతున్నారని తెలిపారు. యూనివర్సిటీ పరీక్షలలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానాన్ని పొందిన మోనిక్ ఇక్బాల్ ఫాతిమా, రెండో స్థానంలో నిలిచిన ప్రవల్లిక, మూడో స్థానాన్ని సాధించిన పేక్ ఖలిక్ సైఫుల్లా, సాయి నిఖిల్, నవ్యతో పాటు సబ్జెక్టుల్లో ప్రథమ స్థానాల్లో నిలిచిన ఉషాప్రియ, సాదియాబానుకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కుప్పయ్యశెట్టి, వైస్‌చైర్మన్ నరసింహరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ శరవణన్ పాల్గొన్నారు.

ముగిసిన పోషణ్ పక్వాడ

వరదయ్యపాళెం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని మరదవాడ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషణ్ పక్వాడ నిర్వహించారు. గర్భిణులకు సీమంతం చేశారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్లు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుపైన రోడ్డు వేశారు... సగంలోనే ఆపేశారు!


రంగనాథపురంలో రోడ్డుపైనే నిర్మించిన మరో సిమెంటు రోడ్డు

సత్యవేడు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి):గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా పల్లెపండుగ పేరుతో రాష్ట్రంలో ప్రతి గ్రామంలో పెద్ద ఎత్తున సిమెంటు రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. నిధులను మంజూరు చేసి పనులను చేపట్టింది. అయితే గ్రామీణ ప్రాంతాల్లో ఈ పనులను చేపడుతున్న నాయకులు పలుచోట్ల ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినబడుతున్నాయి. ఇందుకు మండలంలోని రంగనాథపురంలో చేపట్టిన సిమెంటు రోడ్డే నిదర్శనం. వానెల్లూరు పంచాయతీ రంగనాథపురంలో రమణయ్య ఇంటి నుంచి రాజమ్మ ఇంటి వరకు సిమెంటు రోడ్డును నిర్మించారు. ఇక్కడ అసలు విషయం ఏమిటంటే రూ.లక్షలు వెచ్చించి ఇంతకు ముసుపు ఉన్న బాగున్న రోడ్డుపైనే మళ్లీ రోడ్డును నిర్మించడం గమనార్హం. పోనీ పూర్తిగా నిర్మించారా అంటే అదీ లేదు. రోడ్డు అసంపూర్తిగా నిర్మించడంతో ఎత్తుపల్లాలుగా మారింది. దీంతో వీధిలో నివాసం ఉంటున్న వలువురి రాకపోకలకు అసౌకర్యంగా మారింది. గ్రామంలో పలువీధులు కంకర తేలి ప్రజలు అవస్థలు పడుతున్నా పట్టించుకోకుండా బాగున్న రోడ్డు పైనే మళ్లీ రోడ్డు నిర్మించడంపై గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు అసంపూర్తిగా ఉన్న రోడ్డును పూర్తిగా వేయాలని కోరుతున్నారు.

మా బడిని మార్చొద్దు

- ఎంజీ నగర్ గిరిజనులు, ఏ.పార్లపల్లివాసుల డిమాండ్




నిరసన వ్యక్తం చేస్తున్న ఏ.పార్లపల్లివాసులు - సీపీఎం ఆధ్వర్యంలో ఎంజీ నగర్ గిరిజనుల నిరసన

వరదయ్యపాళెం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎంజీ నగర్‌లో ఉన్న పాఠశాలను మార్చవద్దని గిరిజనులు కోరారు. సోమవారం సీపీఎం నాయకులతో కలిసి ఎంఈవో కార్యాలయం వద్ద నిరసనకు దిగారు. ఈ సందర్భంగా సీపీఎం నియోజకవర్గ కార్యదర్శి చిన్నిరాజ్ మాట్లాడుతూ... ఇప్పుడున్న విద్యావ్యవస్థను మోడల్ ప్రైమరీ, బేసిక్ ప్రైమరీ, ప్రైమరీ, సాటిలైట్ పాఠశాలలు పేరుతో నాలుగు రకాలుగా విభజించాలని రాష్ట్ర ప్రభుత్వం పూనుకుంటోందన్నారు. దీని వలన గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొందన్నారు. మండలంలో సుమారు 24 పాఠశాలలను ఫౌండేషన్ పాఠశాలలుగా మార్చుతున్నారని దీంతో ఎంజీ నగర్ పాఠశాలలో చదువుతున్న పిల్లలు ఐదు కిలోమీటర్లు వెళ్ళి ఉంటుందన్నారు. రవాణా ఖర్చులు ప్రభుత్వం భరిస్తుందని చెబుతున్నా అది ఆచరణలో సాధ్యం కాదన్నారు. అనంతరం ఎంఈవోకు వినతిపత్రం అందజేశారు. పాఠశాల కమిటీ చైర్మన్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏ.పార్లపల్లిలో ఉన్న ప్రాథమిక పాఠశాలను విలీనం చేయడాన్ని గ్రామస్తులు మంగళవారం పాఠశాల ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ... తమ గ్రామంలోని పాఠశాల ఎత్తి వేసి కిలోమీటరు దూరంలో ఉన్న పీవీకండ్రిగ పాఠశాలలో విలీనం చేస్తే తమ పిల్లలను బడి మాన్పించేస్తామన్నారు. ఈ మేరకు ఎంఈవో మునిసుబ్రహ్మణ్యంకు వినతిపత్రం అందజేశారు.

బాలికల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపండి


స్టాల్‌ను పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): బాలికల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు అన్నారు. మండలంలోని రాచగున్నేరి అంగన్‌వాడీ కేంద్రంలో సీడీపీవో శాంతిదుర్గ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గర్భిణులు, బాలింతలు, పిల్లల్లో పౌష్టికాహార లోపం అధిగమించేందుకు సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఈనెల 8నుంచి 22వ తేదీ వరకు పోషణ్ పక్వాడను నిర్వహించినట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారం కిట్లను సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచు భార్గవి, జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గిరిజ, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కవిత, ఏపీఎం నరసింహులు, పంచాయతీ కార్యదర్శి గోవిందు, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, సుమమిత్రలు పాల్గొన్నారు.

కరాటే క్రీడాకారులకు శాప్ చైర్మన్ అభినందనలు

తిరుపతి(క్రీడలు), ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీ వేదికగా ఈ నెల 15నుంచి జరిగినున్న 5వ జాతీయ జూనియర్ జట్టు కరాటే పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్న క్రీడాకారులను శాప్ చైర్మన్ రవినాయుడు అభినందించారు. స్థానిక చింతకాయల వీధికి చెందిన కరాటే క్రీడాకారులు డి.విష్ణుప్రియ, డి.విద్యశ్రీ, డి.హర్షిత, డి.అభినార్ జాతీయస్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం శ్రీనివాస క్రీడాసముదాయంలో శాప్ చైర్మన్‌ను వారు మర్యాదపూర్వకంగా కలిశారు. క్రీడాకారులను ఆయన ఘనంగా సత్కరించారు. జాతీయ స్థాయిలో విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు.

క్యాన్సర్ పట్ల ఆందోళన వద్దు

తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్22 (ఆంధ్రజ్యోతి): మహిళలు క్యాన్సర్ పట్ల ఆందోళన చెందొద్దని డాక్టర్లు కెసుమిత, జ్యోత్స్న పేర్కొన్నారు. మంగళవారం మంగళంలో రాస్, శ్రీవేంకటేశ్వర మెడికల్ కళాశాల, ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి వైద్యులు సంయుక్తంగా మహిళల ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యక్తిగత శుభ్రత, పౌష్టికాహారం గురించి వివరించారు. అనంతరం 42మంది రాస్ పొదుపు సంఘాల మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. ఈ సదస్సులో డాక్టర్లు ప్రమతి, పల్లవి, హారిణిక, మానస, దామిని, శ్రావ్య రాస్ సిబ్బంది, నాగేశ్వర్, రాధ, బాలాజీ, చంద్రశేఖర, సునీల తదితరులు పాల్గొన్నారు.

వెలుగు రుణాల గోల్‌మాల్‌పై విచారణ


మహిళా సంఘాలను విచారిస్తున్న అధికారులు

వరదయ్యపాళెం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి):మండలంలోని వెలుగు సంఘంలో 2022లో జరిగిన రుణాల గోల్‌మాల్‌పై చిత్తూరు డివిజనల్ రెవెన్యూ అధికారి మంగళవారం విచారణ చేపట్టారు. మండలంలోని డీసీ నీటీలో 17 సంఘాల సభ్యుల పేర్ల మీద సుమారు రూ.150కోట్లు ఖాతాల్లో జమ కాలేదు. ఒకరు ఒక గ్రూపులో ఉండి మరో బ్యాంకులో రుణం ఉన్నా అప్పటి ఏపీఎం తనే స్వయంగా బ్యాంకుకు సమర్పించిన రుణ పత్రాల్లో సంఘమిత్రలు, సీసీల సంతకాలు లేకున్నా రుణాలు మంజూరు చేసినట్లు తెలిసింది. మంజూరైన రుణాలను అప్పటి ఏపీఎం తోపాటు మరికొంతమంది తీసుకున్నారు. ఈ గోల్‌మాల్‌పై గతంలో విచారణ జరిగి 11 మంది అక్రమాలకు పాల్పడినట్లు తేల్చారు. ఏసీ ఏపీఎం, ఏడెగా దేవి (సంఘమిత్ర)పై ఇప్పటి వరకు ఎలాంటి చర్యా తీసుకోలేదు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు పీఎం మోదీ డబ్బులు వడతాయని తమల్ని నమ్మించి ఆధారకార్డులు, చిరునామా మార్చి కొత్త సంఘాల పేరుతో రుణాలు తీసుకున్నట్లు బ్యాంకు అధికారులు చెప్పే వరకు తమకు తెలియదని విచారణాధికారి, చిత్తూరు డీఆర్వో మోహన్‌కుమార్, డీసీవో బ్రహ్మానందరెడ్డికి చెప్పారు. వివరాలను వారు నమోదు చేసుకున్నారు. ఇన్‌చార్జి ఏపీఎం సీతారాం, డీసీసీబీ మేనేజరు రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

అధికారులు ప్రొటోకాల్ పాటించాలి


సమావేశంలో ప్రసంగిస్తున్న సుమన్‌కుమార్

నారాయణవనం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండలంలో రాష్ట్రప్రభుత్వం సారథ్యంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలవుతున్నాయని, అయితే కొంతమంది అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని జడ్పీటీసీ సభ్యుడు కోనేటి సుమన్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ దివాకర్‌రెడ్డి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ముందుగా రైలు ప్రమాదంలో మృతి చెందిన భీమునిచెరువు సర్పంచు మురుగేశ్ మృతికి సంతాపం తెలుపుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం సమావేశం నిక ముఖ్య అతిథిగా విచ్చేసిన సుమన్‌కుమార్ మాట్లాడుతూ... అధికారులు అభివృద్ధి పనులపై ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇవ్వడం లేదన్నారు. మండలస్థాయిలో చేసిన తీర్మానాలు, నిర్ణయాలు ఎప్పటికప్పుడు ఎమ్మెల్యేకు తెలియజేయాలన్నారు. ఇతరుల ప్రలోభాలకు, ఒత్తిడులకు లొంగవద్దని, సమాచారం ఇవ్వకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. అలాగే సర్పంచులు తమ గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శేఖర్, తహసీల్దార్ జయరాములు, ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు, సర్పంచులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, అన్ని ప్రభుత్వ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

అమరా హాస్పిటల్‌లో సెప్సిస్‌పై మెడికల్ కాన్ఫరెన్స్



కాన్ఫరెన్స్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న రమాదేవి

రేణిగుంట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరకంబాడి వద్ద ఉన్న అమరా హాస్పిటల్‌లో మంగళవారం ఉదయం కంబాట్ సెప్సిస్, మాస్టరింగ్ సెప్సిస్ మేనేజ్మెంట్, టైలరింగ్ యాంటీబయోటిక్ థెరపీపై రాష్ట్ర స్థాయి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రముఖ వైద్యులు అల్లాడి మోహన్, అలోక్, రాధా, మదన్‌మోహన్ రెడ్డి, సుబ్బారావు, ప్రవీణ్, ఇన్ఫెక్షన్ డిసీజ్ స్పెషలిస్ట్ డాక్టర్ శ్రీనివాస్‌కర్, విజయ్‌కుమార్, మోనాలిసా సాహు తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కాన్ఫరెన్స్‌లో సెప్సిస్ నిర్వహణలో వైద్య పరమైన వైఖరులను పెంపొందించడం, యాంటీ బయోటిక్స్ హేతుబద్ధమైన ఉపయోగంపై ప్రముఖంగా చర్చించారు. ఆరోగ్య సంరక్షణలో నిరంతర అధ్యయన ప్రాముఖ్యాన్ని ప్రస్తావించారు. పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు, అధ్యాపకులు, ప్రాక్టీస్ చేసే వైద్యులు సహా 400 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎస్‌సిసిఎం అధ్యక్షుడు డాక్టర్ హరికృష్ణ, జనరల్ సెక్రటరీ రాజా ప్రతాప్ సింహ, అమరా హాస్పిటల్ వైద్యులు రవికుమార్, శంకర్, అరుణ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఒలంపియాడ్‌లో శ్రీచైతన్య విద్యార్థుల సత్తా



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జయరామారావువీధిలో ఉన్న శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలంపియాడ్‌లో సత్తా చాటారు. మొదటి స్థానంలో నిలిచిన జాహ్నవి ట్యాబ్‌ను కైవసం చేసుకుంది. షోయబ్ పఠాన్, మోక్షజ్ఞ, మనస్విని తరువాతి స్థానాల్లో నిలవగా, సంజయ్, జ్ఞాపిక ఐదో స్థానంలో నిలిచారు. వీరిని ఎంఈవోలు భువనేశ్వరి, బాలయ్య అభినందించారు. ఏజీఎం సురేష్, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త మృతికి నివాళి

నారాయణవనం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని భీముని చెరువుకు చెందిన టీడీపీ క్రియాశీల కార్యకర్త సొరకాయలు అలియాస్ చంద్రబాబు నాయుడు(60) కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం ఉదయం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఫోన్ ద్వారా కుటుంబాన్ని పరామర్శించారు. నారాయణవనం జడ్పీటీసీ సుమన్‌కుమార్ భీమునిచెరువుకు చేరుకుని సొరకాయలుకు నివాళులర్పించారు. అనంతరం రూ.10 వేలను కుటుంబీకులకు అందించారు. మాజీ సర్పంచ్ రమేష్, నాయకులు సుధాబాబు, కృష్ణయ్య, మురళి, కృష్ణ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

డీఎస్సీతో నిరుద్యోగుల కళ్లలో వెలుగులు

తిరుపతి(జీవకోన), ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ నోటిఫికేషన్‌తో నిరుద్యోగుల కళ్లలో వెలుగులు నిండాయని నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం అన్నారు. మంగళవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇచ్చిన మాట ప్రకారం సీఎం చంద్రబాబు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు. అలాగే యువగళం పాదయాత్రలో ప్రస్తుత మంత్రి లోకేశ్ మెగా డీఎస్సీ ఇస్తామని ప్రకటించారని గుర్తుచేశారు. టీడీపీ మ్యానిఫెస్టోలో సైతం డీఎస్సీని చేర్చారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కుమార్ రమ్య, రజక కార్పొరేషన్ డైరెక్టర్ కరాటే చంద్ర, శాలివాహన విభాగం పార్లమెంటు కన్వీనర్ ఆముదాల తులసీదాస్, రజక సంఘం రాష్ట్ర నాయకులు అక్కినపల్లి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిశోధన ఫలాలు రైతుల చెంతకు చేర్చాలి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పరిశోధన ఫలితాలు రైతుల చెంతకు చేర్చాలని జాతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ (ఐసీఏఆర్) డిప్యూటీ డైరెక్టర్ రాజ్‌బీర్‌సింగ్ పేర్కొన్నారు. ఎస్వీ వ్యవసాయ కళాశాలలో అగ్రిటెక్ పై మంగళవారం జరిగిన జాతీయ సదస్సులో ఆయన ప్రసంగించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, పరిశోధన కేంద్రాల మధ్య సమన్వయం అవసరమన్నారు. పరిశోధనల్లో రైతుల అనుభవాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ఆధునిక సాంకేతిక వినియోగంపైనా, ఆహార భద్రతపైనా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వీసీ శారదజయలక్ష్మీ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలోని సవాళ్లు, పరిష్కారాలపై వ్యవసాయ విద్యార్థులు అవగాహన పెంచుకోవాలన్నారు. మరోవైపు కృషి విజ్ఞాన కేంద్రం వీసీ ఇంద్రమణి మాట్లాడుతూ... పోషక ఆహార ఉత్పత్తుల తయారీని వేగవంతం చేయడానికి టెక్నాలజీని ఉపయోగించుకోవాలన్నారు. తంజావూరు నిఫ్ట్ డైరెక్టర్ ముత్తు మాట్లాడుతూ వ్యర్థాలతో ఉత్పత్తులను తయారు చేయడం ద్వారా ఎంటర్‌ప్రైజెస్‌ను ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీన్ రమణ, అసోసియేట్ డీన్ సుమతి, నిర్వాహకులు సుబ్రమణ్యం, కల్యాణి, మోహన్, బాలాజీ, హైదరాబాదు ఇక్రిసాట్ శాస్త్రవేత్తలు హరికిషన్, మనీష్‌పాండే, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.